ప్రజాశక్తి

గురువారం 14 నవంబర్ 2024 8 పేజీలు

ప్రకాశం బాపట్ల

పూర్వ డిపిఒ

ఉషారాణి సస్పెన్షన్

ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిల్లా పంచాయతీ శాఖ ఉద్యోగుల సాధారణ బదిలీలలో భారీ అక్రమాలకు పాల్పడ్డారని పూర్వ జిల్లా పంచాయతీ అధికారి, డిఎల్‌డిఒ టి.ఉషారాణిని సస్పెండ్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఉషారాణిని సస్పెండ్ చేస్తూ బుధవారం ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఉషారాణి ప్రకాశం కలెక్టర్ నోట్ ఉత్తర్వులను ఉల్లంఘించి.. పంచాయతీ కార్యదర్శుల బదిలీలలో భారీగా డబ్బులు వసూలు చేశారనే ఆరోపణలపై ఫారెస్ట్ సెటిల్‌మెంట్ అధికారి లోకేశ్వరరావును కలెక్టర్ ఏ.తమీమ్‌అన్సారియా విచారణకు ఆదేశించారు. ఆయన పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులను విచారణ జరిపి పూర్వ డిపిఒ భారీగా అక్రమాలకు పాల్పడ్డారని కలెక్టర్‌కు నివేదికను అందజేశారు. ఈ నివేదికను కలెక్టర్ ప్రభుత్వానికి పంపారు. ప్రభుత్వం, కేసు పరిస్థితులలో లభ్యమైన అంశాలను జాగ్రత్తగా పరిశీలించిన తర్వాత పూర్వ డిపిఒ ఉషా రాణి సాధారణ బదిలీల సమయంలో తీవ్రమైన అవకతవకలకు పాల్పడ్డారని గమనించారు. ప్రకాశం జిల్లాలో విధులను నిర్వర్తించడంలో ఆమె నిర్లక్ష్యాన్ని ప్రదర్శించిందని మరియు ఆ విధంగా ఆమె ఎపిసిఎస్(ప్రవర్తన) నియమాలు, 1964లోని రూల్ 3ని ఉల్లంఘించారని, ఆంధ్ర ప్రదేశ్ సివిల్ సర్వీస్ (సిసి, ఏ) రూల్స్, 1991 రూల్ 8(1) ద్వారా అందించబడిన అధికారాలను అమలు చేస్తూ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉషారాణిని సస్పెండ్ చేసింది. సస్పెన్షన్ ఉత్తర్వుల సమయంలో ఆమె ప్రకాశం జిల్లా, ప్రధాన కార్యాలయంలోనే ఉండాలని, ముందస్తు అనుమతి లేకుండా ప్రధాన కార్యాలయాన్ని వదిలి వెళ్లకూడదని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సస్పెన్షన్ వ్యవధిలో, అమలులో ఉన్న నిబంధనల ప్రకారం జీవనాధార భత్యం చెల్లించనున్నారు. ఈ విషయంలో పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ తదుపరి చర్యలు తీసుకుంటారని సస్పెన్షన్ ఉత్తర్వులలో పేర్కొన్నారు.

'వెలిగొండ' ప్రాజెక్టుకు

ఈ నిధులెలా సరిపోతాయో.?

- అవసరం రూ.2 వేల కోట్లకు పైనే.!
- ఇచ్చింది రూ.394 కోట్లే..
- నిర్వాసితులకు ప్యాకేజీల కోసం రూ.వెయ్యి కోట్లకు పైనే అవసరం
- నిధుల కేటాయింపుపై సిఎంకు జిల్లా ప్రజాప్రతినిధుల కృతజ్ఞతలు

ఇటీవల వెలిగొండ ప్రాజెక్టును పరిశీలిస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు (ఫైల్)

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

వెలిగొండ ప్రాజెక్టుకు భారీగా నిధుల అవసరం ఉంది. రెండేళ్లలో పూర్తి చేస్తామని మంత్రులు ప్రకటించిన సంగతి తెలిసిందే. వాళ్ల అంచనా మేరకే ఈ ఏడాది కనీసం రూ.2500 కోట్లు మేరకు అవ సరం అవుతాయని అంచనా వేశారు. ప్రస్తుతం జరుగుతున్న శాసనసభలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కేవలం రూ.394 కోట్లు మాత్రమే నిధులు కేటాయిం చారు. ఈ నిధులు వెలిగొండకు సరిపోతాయా? నిర్వా సితులు, పెండింగు బిల్లులు, పునరావాస కాలనీల్లో సౌకర్యాలు, మిగిలిపోయిన సొరంగాల పనులు ఎలా పూర్తిచేస్తారన్నదే ప్రశ్న.

మంగళవారం నాడు సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు ఈ ప్రాజెక్టు సొరంగాలను పరిశీలించారు. అనంతరం మార్కా పురంలో నిర్వాసితులతోనూ సమావేశమయ్యారు. నిర్వాసితులు తమ గోడును వెల్లబోసుకున్నారు. బడ్జెట్‌లో కేటాయింపులపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కనీసం బడ్జెట్‌లో రూ.1500 కోట్లు కేటా యించినా ప్రాజెక్టు పూర్తి చేస్తారనే నమ్మకం ఉండేదనే అభిప్రాయం రైతుల్లోనూ ఉంది. ఇదే విషయాన్ని సిపిఎం జాతీయ నేత వద్ద ప్రస్తావిం చారు. ఈ అరకొర నిధులకే జిల్లా ప్రజాప్రతినిధులు సిఎం చంద్ర బాబును ప్రత్యేకంగా కలిశారు. కృతజ్ఞతలు తెలిపారు. వెలిగొండకు కేటాయించిన నిధులపై హర్షం వ్యక్తం చేశారు. అంటే వాళ్ల దృష్టిలో ఈ నిధులు సరిపోతాయా? ఈ ఏడాది బడ్జెట్‌లో కేటాయింపులు చాలా స్వల్పంగా ఉన్నాయి. దీంతో ప్రాజె క్టును పూర్తిచేస్తామని చెప్పిన మంత్రులే ఆలోచించాలి. ఎంత మేరకు రైతులు, ప్రజల ఆకాంక్షలు నెరవేర్చుతారన్నదే చూడాలి. గత ప్రభుత్వం నిర్వాసితులను తీవ్రంగా మోసం చేసింది. మభ్యపెట్టి ఎన్నికల ముందు ప్రాజెక్టును ప్రారంభించింది. రెండు సొరంగాలూ అసంపూర్తిగానే ఉన్నాయి. బిల్లులు కూడా రూ.120 కోట్ల మేరకు పెండింగులో ఉన్నాయి. మొదటి సొరం గంలో లైనింగ్ పనులున్నాయి. రెండో సొరంగం పూర్తి కాలేదు. మాన్యువల్‌గా తవ్వి ఆ మట్టిని మొదటి సొరంగంలో పోశారు. దీన్ని ఎత్తిపోయడం పెద్ద సవాలుగానే మారనుంది. రెండు సొరంగాల మధ్య రంధ్రాలూ పెట్టారు. వీటిని కూడా ▶ 2లో

జోరు వాన

చీరాలలో చర్చి రోడ్డులో నిలిచిన వర్షపు నీరు

- ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో పలు చోట్ల భారీ వర్షం
- జలమయమైన రహదారులు

అల్పపీడనం ప్రభావంతో ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో పలు చోట్ల బుధవారం భారీ వర్షం కురిసింది. ప్రకాశం జిల్లాలో శింగరాయ కొండలో 70.2 మి.మీ.ల అత్యధిక వర్షపాతం నమోదైంది. బాపట్ల జిల్లా, చీరాలలో వాన దంచికొట్టింది. దీంతో రోడ్లన్నీ జలమయ మయ్యాయి.

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండలో బుధవారం నాడు భారీ వర్షం నమోదయింది. వర్షం కారణంగా సము ద్రంలో అలల తీవ్రత కారణంగా మత్స్యకారులు ఎవరూ సము ద్రపు వేటకు వెళ్లటం లేదు. వర్షం కారణంగా శింగరాయకొండ, ట్రంకురోడ్డు జలమయ మైంది. సోమరాజుపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని టిపి నగర్ అప్పాపురంలో వర్షం తాకిడికి గిరిజనుల ఇళ్లల్లోకి నీరు చేరింది.

శింగరాయకొండలో కూలిన ఇంటి గోడ

కూలిన ఇంటి గోడ

రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి గోడ నాని కూలిపోయిన ఘటన శింగరాయకొండ గ్రామపంచాయతీ పరిధిలోని కరేటి వారి వీధిలో బుధవారం చోటుచేసుకుంది. శ్రీనివాసరావు అనే వ్యక్తికి సంబంధించిన ఇల్లు మట్టి గోడలు పాతవి కావడంతో వర్షానికి నాని పోవడం వల్ల ఆ గోడ ఇంటి వైపు కూలిపోయింది. దీంతో ఇంట్లో ఉన్న బీరువా, ఫ్రిజ్‌పైన గోడ పడటంతో నష్టం జరిగిందని రెవెన్యూ అధికారులకు తెలియజేశారు. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పిందని కుటుంబ సభ్యులు తెలిపారు.

శింగరాయకొండలో రోడ్డుపై నిలిచిన వర్షపునీరు

చీరాలలో దంచి కొట్టిన వాన

చీరాల: చీరాలలో వర్షం దంచి కొట్టింది. బుధవారం మధ్యాహ్నం కురి సిన వర్షానానికి పట్టణంలోని రోడ్లన్నీ జలమయమయ్యాయి. భారీ వర్షం కురవడంతో పట్ట ణంలోని డ్రైన్లన్నీ నిండిపోయి పొంగిపొర్లాయి. రోడ్లపైకి వర్షపునీటితో పాటు మురికి నీరు చేరటంతో కాలువలను తలపించాయి. ▶ 2లో

ఒంగోలులో

నేడు సిపిఎం బహిరంగ సభ

హాజరుకానున్న రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

సిపిఎం 13వ ఒంగోలు నగర మహా సభల సందర్భంగా గురువారం సాయంత్రం నాలుగు గంటలకు నగరంలోని అద్దంకి బస్టాండ్ సెంటర్‌లో 'ప్రజా పోరు' బహిరంగ సభ నిర్వహించనున్నట్లు ఆ పార్టీ నగర కమిటీ కార్యదర్శి జి.రమేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సభలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ప్రసంగిస్తారని తెలిపారు. ముందుగా మధ్యాహ్నం మూడు గంటలకు మున్సిపల్ కార్యాలయం నుంచి అద్దంకి బస్టాండ్ సెంటర్ వరకు ప్రదర్శన ఉంటుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. నగర ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

నేటి నుంచి 'బంగారు బాలోత్సవాలు' ▲ 8లో

వెలిగొండ ప్రాజెక్టుకు ఈ నిధులెలా సరిపోతాయో.?

(మొదటిపేజీ తరువాయి)

పూడ్చాలి. కాలు వలు, హెడ్ రెగ్యులేటర్ పనులు అసంపూర్తిగా ఉన్నాయి. ఇవన్నీ పూర్తిచేయాలంటే కార్యాచరణ ప్రణాళిక ఉండాలి. వాస్తవానికి రెండేళ్లలో పనులు పూర్తి చేసి నీళ్లిస్తామని మంత్రులు చెప్పారు. అయితే మొదటి సొరంగం పూర్తయినందున దాన్నుంచి కనీసం వచ్చే జూన్ నాటికి వరద నీరు వచ్చే వీలున్నందున ఆ కార్యక్రమం చేసేందుకు కూడా చర్యలు లేవు. మొదటి సొరంగంలో మట్టి పోశారు. చివర లైనింగ్ పనులు కూడా 500 మీటర్లకు పైగానే పెండింగ్‌లో పెట్టారు. బిల్లులు రానందునే కాంట్రాక్టర్లు దీన్ని వదిలేశారని సమాచారం. అన్నింటికీ నిధులతోనే ముడిపడింది. నిర్వాసితులకు ప్యాకేజీల కోసమే రూ.1000 కోట్ల వరకూ కావాలి. బడ్జెట్‌లో వీరి ప్రస్తావనే లేదు. కేటాయింపులు అరకొరగా ఉన్నందున సగం పెండింగు బిల్లులకు పోతాయి. మిగతావి నిర్వహణ, వేతనాలకు సరిపోతాయి. ఇక ప్రాజెక్టుకు నిధులు ఎక్కడవన్నదే ప్రశ్న. ఇప్పటికైనా జిల్లా మంత్రులు దీనిపై దృష్టి సారించాలి. నిధుల కోసం గట్టిగా ప్రయత్నాలు చేయాలి. సిఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలియడం మంచిదే. అయితే ఆ సమయంలోనైనా నిధులు అవసరం ఆయన దృష్టికి తీసుకుపోయారా? లేదా? అనేది స్పష్టత లేదు. ప్రాజెక్టుకు ఎంత అవసరమనేదీ నేతలకు తెలుసు. వాటిని సాధించేందుకు ఈ సమావేశాలు ముగిసేలోపు ఒక స్పష్టతకు రావాల్సి ఉంది. లేకుంటే రెండేళ్లలో పూర్తిచేస్తామన్న హామీ మరో రెండేళ్లు అంటే నాలుగేళ్లు పట్టినా ఆశ్చర్యం లేదన్న విషయం గ్రహించాలి.

జోరు వాన

(మొదటిపేజీ తరువాయి)

ప్రధానంగా సురేష్ మహల్ నుండి మసీదు సెంటర్ వరకు రోడ్లు పైకి మోకాలు లోతులో నీరు చేరింది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. దండుబాట రోడ్డు లోని లోతట్టు ప్రాంతంలో నివాసం ఉంటున్న ఇళ్ల చుట్టూ వర్షపు నీరు చేరి అక్కడా చెరువులను తలపించాయి. సుమారు రెండు గంటల పాటు వర్షం ఏకధాటిగా కురిసింది. డ్రైనేజీ పారుదల వ్యవస్థ సక్రమంగా లేకపోవడం వల్లే రోడ్లపై వర్షపు నీరు అధికంగా చేరి ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. మున్సిపల్ అధికారులు కాలువల పూడికలు తీయించి మురుగునీరు కుందేరులో చేరేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పిడుగుపాటుకు కదిలిన నీళ్ల ట్యాంక్

మర్రిపూడి: వర్షం కారణంగా మండలంలోని గుండ్ల సముద్రం గ్రామంలోని నీళ్ల ట్యాంకుకు సమీపంలో పిడుగు పడటంతో ఆ ప్రకంపనలకు ట్యాంకు ఓ పక్కకు ఒరిగింది. పూర్తిగా శిథిలావస్థకు చేరిన పాత నీళ్ల ట్యాంక్ సమీపంలో జరిగిన పిడుగుపాటుకు ఎక్కడ నీళ్ల ట్యాంకు కూలుతుందోనని గ్రామస్తులు భయాందోళన చెందారు.

పొంగిన కాలువలు

పొదిలి: పొదిలి పట్టణంలో బుధవారం కురిసిన భారీ వర్షానికి మురుగు కాలువలు పొంగాయి. తాలూకా ఆఫీస్ వీధి, మాయాబజార్‌లతో పాటు ప్రధాన రహదారిలో పాత ఫోస్టాఫీస్ సెంటర్, ప్రభుత్వ వైద్యశాలవద్ద వర్షపు నీరు నిలిచిపోయి వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అంతేకాక ప్రధాన రహదారిలో విశ్వనాథపురంలో గ్యాస్ ఏజెన్సీ, మండల పరిషత్ కార్యాలయం వద్ద గతంలో మాదిరిగానే భారీగా వర్షపు నీరు నిలిచిపోయింది. డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో పొదిలి రోడ్లు వాగులు, వంకలను తలపిస్తున్నాయి.

ప్రతి ఇంటికి వెళ్లి సర్వే చేయాలి

మద్దిపాడు : సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి సిబ్బంది సర్వే చేయాలని ఎంపిడిఒ జ్యోతి తెలిపారు. మండల పరిధిలోని బసవన్నపాలెం సచివాలయాన్ని బుధవారం సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ హౌస్ హోల్డ్ జియో కోఆర్డినేటర్ సర్వేను త్వరగా పూర్తి చేయాలన్నారు. సర్వేలో ఏమైనా సందేహాలు ఉంటే వెంటనే తనను సంప్రదించాలన్నారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ శివదుర్గ , సచివాలయ సిబ్బంది ఉన్నారు.

సాదాసీదాగా మండల సమావేశం

ప్రజాశక్తి- హనుమంతునిపాడు

మండల సర్వసభ సమావేశం ఎంపిపి గాయం సావిత్రి అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఎలాంటి అజెండా లేకుండా సదాసీదాగా సమావేశం ముగించారు. ఈ సందర్భంగా ఎంపిపి గాయం సావిత్రి మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో గ్రామాలలో పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. వైద్య సిబ్బంది ప్రజలు అందుబాటులో ఉండాలన్నారు. ఎంపిటిసి ఉడుముల సుబ్బారెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో గ్రామాలలో నిర్వహించిన పనులలో లోపాలు జరిగినట్లు తెలిపారు. ప్రజా ప్రతినిధులకు తెలియకుండా బిల్లులు చేసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ రంగ సుబ్బరాయుడు, ఆర్డబ్ల్యుఎస్ ఎఇ శ్రీకాంత్, ఎఒ రమణ, అంజలి, వైస్ ఎంపిపి రుద్రపాటి శోభ, సర్పంచులు సానికొమ్ము మధుసూదన్ రెడ్డి, భవనం కష్టారెడ్డి, సానికొమ్ము బ్రహ్మారెడ్డి, కత్తి రాజారావు, కూడలి అరుణా దశరథ, పంచాయతీరాజ్ ఎఒ బ్రహ్మయ్య, రామకష్టారెడ్డి, ఎంపిటిసిలు సూరిశెట్టి నారాయణస్వామి, తిరుపతి రెడ్డి, గూడూరి దేవమ్మ,రాజు , వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిపి గాయం సావిత్రి

రాజకీయ ప్రయోజనాల కోసం

విద్యార్థులను బలి పశువులు చేయొద్దు

ప్రజాశక్తి-కనిగిరి

రాజకీయ ప్రయోజనాల కోసం విద్యార్థులను బలిపశువులను చేయవద్దని, విద్యా సంవత్సరం సాఫీగా సాగేందుకు తోడ్పడాలని ఎస్ఎఫ్ఐ నాయకులు పివి. శేషయ్య అధికారులను కోరారు. పిసిపిల్లి మండలం పెద్దవరిమడుగు ప్రైమరీ స్కూల్‌లో పనిచేస్తన్న మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులను మార్చాలంటూ చేస్తున్న రగడకు రాజకీయరంగు పులమండల దురదష్టకరం. ఈ స్కూల్ బోధనలోను, ఉత్తీర్ణతలోనూ అత్యుత్తమ ఫలితాలు సాధిస్తున్నట్లు తెలిపారు. సమస్యను మండల విద్యాశాఖ అధికారుల దష్టికి తీసుకువెళ్లి తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి వారి మనోభావాలను స్వయంగా తెలుసుకొని పరిష్కరించాలని కోరినట్లు తెలిపారు. అయితే మండల విద్యాశాఖ అధికారులు మొఖం చాటేసినట్లు తెలిపారు. మధ్యాహ్న భోజనం కార్మికులలో ఒకరు వృద్ధాప్యంతో విధుల నుంచి తప్పుకున్నట్లు తెలిపారు. ఆమె స్థానంలో కొత్తవారిని నియమించుకోవడానికి అవకాశం ఉందన్నారు. అయితే రాజకీయ కారణాలతో కొత్తగా ఇద్దరిని తమవారిని నియమించాల్సిందే నాయకులు పట్టుబడుతున్నారన్నారు. ప్రశాంత వాతావరణాన్ని కలుషితం చేసే పద్ధతిలో రాజకీయాలు చొప్పించడం, విద్యార్థులను ఇక్కట్లకు గురి చేయడం సరైనది కాదు. తల్లిదండ్రులతో కూడిన స్కూల్ నిర్వహణ కమిటీ మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకుల కషిని శ్లాఘిస్తున్నది. తిండి తింటున్న విద్యార్థులు పూర్తి సంతప్తిని వ్యక్తం చేస్తున్నారు. మధ్యాహ్న భోజన పథకం సిబ్బంది పనితీరుపై ఎలాంటి ఫిర్యాదులు లేవన్నారు. కొత్త ప్రభుత్వం వచ్చింది కనుక మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులను మార్చాలన్న డిమాండ్‌ను ముందుకు తీసుకురావడాన్ని స్థానిక ఎమ్మెల్యే సున్నితంగా తిరస్కరించినట్లు తెలిపారు. అధికార పార్టీ ఒత్తిళ్లకు లొంగిన మండల విద్యాశాఖ అధికారులు సమస్యను పరిష్కరించకుండా చోద్యం చూస్తున్నట్లు తెలిపారు. ఒత్తిడి తట్టుకోలేని ప్రధానోపాధ్యాయుడు సెలవుపై వెళ్లినట్లు తెలిపారు. ఇప్పటికైనా ఎస్ఎం సి కమిటీ మరియు విద్యార్థుల మనోభావాలను గుర్తించి పాతవారిని కొనసాగిస్తూ, ఈ సమస్యను ఇంతటితో పరిష్కరించి విద్యా సంవత్సరం ప్రశాంతంగా నడిచేందుకు అందరూ కృషి చేయాలన్నారు.

పివి. శేషయ్య

కరపత్రాలు ఆవిష్కరణ

ప్రజాశక్తి-దర్శి : పొదిలిలో నిర్వహిస్తున్న అఖిల భారత విద్యార్థి సమాఖ్య 20వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆర్.కరుణానిధి కోరారు. స్థానిక సిపిఐ కార్యాలయంలో ఎఐఎస్ఎఫ్ మహాసభలకు సంబంధించిన కరపత్రాలను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కరుణానిధి మాట్లాడుతూ రాష్ట్రంలో నెలకొన్న విద్యారంగ సమస్యలపై మహాసభలో చర్చించి భవిష్యత్తు ఉద్యమ కార్యచరణ రూపొందిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి రామాంజి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న దర్శి విద్యుత్ ఇఇ శ్రీనివాసులు

సోలార్ విద్యుత్‌తో ఉపయోగం

ప్రజాశక్తి-చీమకుర్తి : సోలార్ విద్యుత్ంఎ వినియోగదారులకు ఎంతో ఉపయోగ కరమని దర్శి విద్యుత్ ఇఇ శ్రీనివాసులు తెలిపారు. స్థానిక దీన్నేపురం సెంటర్లో ప్రధానమంత్రి సూర్య ఘర్ పథకంపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడారు. సోలార్ విద్యుత్తు వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్తు డిప్యూటీ ఇఇ మోహన్ రావు, అసిస్టెంట్ ఇఇ చంద్రశేఖర రావు, ఎఇ శ్రీనివాసరావు, చీమకుర్తి ఎఇ చంద్రశేఖర్, విద్యుత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న ప్రజలు

రోడ్డుపై ముళ్లకంప వేసి నిరసన

ప్రజాశక్తి- కనిగిరి : కనిగిరి మున్సిపాలిటీ పరిధిలోని టకారిపాలెంకు చెందిన ప్రజలు జాతీయ రహదారిపై ముళ్ల కంప వేసి బుధవారం నిరసన తెలియజేశారు. టకారిపలెంలో నీటి, విద్యుత్, డ్రైనేజీ సమస్యలు కారణంగా ఇబ్బంది పడుతున్నామంటూ ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్డుపై ముళ్లకంప వేయడంతో వాహనాల రాకపోకలు నిలిచి పోయాయి. సమాచారం అందుకున్న ఎస్ఐ టి. శ్రీరామ్ ఘటనా స్థలానికి చేరుకుని స్థానికులతో మాట్లాడారు. ముళ్లకంప తొలగించి వాహనాల రాకపోకలకు అంతరాయం లేకుండా చేశారు.

ప్రత్యామ్నాయ పంటల సాగుపై శిక్షణ

ప్రజాశక్తి- కనిగిరి : మండల పరిధిలోని బొమ్మిరెడ్డిపల్లి, గుడిపాడు రైతు సేవా కేంద్రాల పరిధిలోని గుండ్లపాలెం, గోవిందవారి పాలెం, కొత్తపాలెం గ్రామాలలో పొగాకు పంటకు బదులుగా ప్రత్యామ్నాయ పంటల సాగుపై బుధవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ జ్యోత్న్న దేవి మాట్లాడుతూ రైతులు తమకు అనుమతి ఇచ్చిన కోట మేరకే పొగాకు పండించాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సేవా కేంద్రాల సిబ్బంది తాతపూడి రాజశేఖర్, గొర్రె వెంకట సుబ్బారావు, యోగేశ్వరి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాలు అందజేత

దర్శి : దర్శికి చెందిన శ్రీపూసల తిరుపతమ్మ ప్రథమ వర్ధంతి సందర్భంగా వారి కుటుంబ సభ్యులు స్థానిక శ్రీ షిరిడి సాయిబాబా వద్ధాశ్రమంలో వద్ధులకు 25 కేజీల బియ్యం మరియు కందిపప్పు, పండ్లు మిఠాయిలు బుధవారం అందజేశారు.

यूनियन बैंक ऑफ इंडिया
भारत सरकार का उपक्रम
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
భారత ప్రభుత్వ రంగ సంస్థ
కొరిటెపాడు బ్రాంచి - 03141, గుంటూరు - 522007

సవరణ

ది. **12-11-2024** న ఈ దినపత్రికలో ప్రచురితమైన యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్వాధీనత ప్రకటన లోని **ఋణగ్రహీత : శ్రీ వెన్నపూస బాపిరెడ్డి** గారి ఆస్తి స్వాధీనత తేది : 06-11-2024కి బదులు **ది. 07-11-2024 గా చదువుకోగలరు.** మిగతా వివరములలో ఎలాంటి మార్పు లేదు.

అధీకృత అధికారి

మహారాజశ్రీ ఒంగోలు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

OS No : 757/2022

కొమ్మాలపాటి సత్యనారాయణ ...వాది

వర్సెస్

లింగా శ్రీనివాసులు ...ప్రతివాది

నోటీసు

To

లింగా శ్రీనివాసులు, S/o ఆదినారాయణ,గుండ్లాపల్లి గ్రామం, మద్దిపాడు మండలం, ప్రకాశం జిల్లా.

ప్రస్తుత నివాసం

H.No-191,లక్ష్మీనరసింహాపురం,సమతా నగర్, కర్నూల్ రోడ్డు, ఒంగోలు, ప్రకాశం జిల్లా.

పై నెంబరు గల దావాలో మీకు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపించిననూ జారీ కాబడి యుండలేదు కానా శ్రీయుత కోర్టు వారి ఉత్తర్వుల మేరకు తెలియజేయునది ఏమనగా తేది 29-11-2024 న ఉదయం గం 10.30 నిమిషాలకు పై కోర్టులో మీరు స్వయంగా గాని లేదా వకీలు ద్వారా గాని హాజరై ఆక్షేపణలు తెలుపుకునేది లేనియెడల మీ పరోక్షమున తీర్మానించబడునని తెలియజేయడమైనది

ఇట్లు

చుండూరి వెంకట్రావు
మోరుబోయిన కోటయ్య
పసుపులేటి గోపాలరావు
పేర్ల మల్లిఖార్జునరావు, అడ్వకేట్స్
జిల్లా కోర్టు ఎదురు ఒంగోలు
సెల్ నెం.**9440510269**

మహారాజశ్రీ శ్రీయుత ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో ఒంగోలు

O.S.No.1069/2023

తుమ్మపూడి బుచ్చిబాబు .... వాది

Vs

కంకిపాటి వెంకట రవికుమార్ ..... ప్రతివాది

To

ప్రతివాది:-

కంకిపాటి వెంకట రవికుమార్,
తండ్రి విశ్వేశ్వర రావు, హిందువు,
వ్యాపారము, వయస్సు 48 సం.లు,
నివాసం : ఇంటి నెం.యం.ఐ.జి.-1-358,
హౌసింగ్ బోర్డు కాలని, ఒంగోలు నగరం,
ప్రకాశం జిల్లా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం.

దావా సమను

పై నెంబరు దావాను వాది నీ పై ప్రామిశరి నోటు బాకీ వసూలు నిమిత్తమై దాఖలా చేయగా కోర్టు వారు నీకు ఎన్ని పర్యాయములు దావా సమన్లు పంపిననూ నీవు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున పేపరు ప్రకటన ద్వారా నీకు దావా సమన్లు జారీ చేయమని ఉత్తర్వులు ఇచ్చియున్నారు. పై నంబరు దావా నీయొక్క హాజరు నిమిత్తమై తేదీ. 04-12-2024 నకు వాయిదా అయి వున్నది కనుక సదరు వాయిదా తేదీన ఉదయం 10 గంటల 30 నిమిషములకు నీవు స్వయముగా గానీ, న్యాయవాది గారి ద్వారా గానీ పై కోర్టు వారి ఎదుట హాజరు అయి నీకు గల అభ్యంతరములను వ్రాత పూర్వకముగా తెలియచేసుకొనగలరు, లేని యెడల నీకు పరోక్షముగా తీర్మానము చేయబడునని తెలియచేయడమైనది.

// కోర్టు వారి అనుమతితో //

స్థలం : ఒంగోలు
తేది : 12-11-2024 ఇట్లు

పి.వి. శ్రీనివాసగుప్తా,
కె.ఆర్.తిమోతిపాల్, న్యాయవాదులు,
ఒంగోలు, ప్రకాశంజిల్లా, ఆంధ్రప్రదేశ్.
సెల్ నెంబర్ : **9866447247**

వాయు కాలుష్య నియంత్రణకు చర్యలు

మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలి

అధికారులకు కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశం

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ప్రజాశక్తి-కలెక్టరేట్

ఒంగోలు నగరంలో వాయు కాలుష్యం నియంత్రణకు పటిష్టమైన ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాంలో కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో వాయుకాలుష్య నియంత్రణ అమలుపై జిల్లాస్థాయి కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జాతీయ హరిత ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి దేశంలోని వాయు కాలుష్యం కలిగిన నగరాలలో కాలుష్య నియంత్రణకు ప్రణాళికబద్ధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించిందన్నారు. వాటిలో ఒంగోలు నగరం ఒకటని, నగరంలో వాయు కాలుష్యం వ్యాపించడంపై మూలకారణాలు తెలుసుకుని, వాటిని నియంత్రించేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించి పటిష్టమైన చర్యలు చేపట్టాలన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఒంగోలు నగరంలో కాలుష్య నియంత్రణకు పెద్దఎత్తున మొక్కల నాటే కార్యక్రమాన్ని నిర్వహించాలని, వాహనాల ద్వారా కాలుష్యం వ్యాపించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నగరంలో తడి, పొడి చెత్తల సేకరణ విధానాన్ని నిబంధనల ప్రకారం చేయాలన్నారు. వాహనాలకు వినియోగించే ఇంధనం కల్తీ లేకుండా చూడాలని, ప్రతీ పెట్రోల్ బంక్‌లలో సరఫరా అయ్యే ఇంధనం నిబంధనల మేరకు ఉండేలా అధికారులు తనిఖీ చేయాలన్నారు. ఒంగోలు నగరంలో వాయు కాలుష్యం వ్యాప్తి చెందే ముఖ్యమైన ప్రాంతాలను గుర్తించి ఆయా ప్రాంతాలలో ఈ కాలుష్య నియంత్రణకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలకు స్వచ్ఛమైన గాలిని అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. వాయు కాలుష్య నియంత్రపై తీసుకోవలసిన చర్యలపై ప్రజలకు అవగాహన కలిగించేందుకు కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో కాలుష్య నియంత్రణ మండలి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాఘవ రెడ్డి, ఒంగోలు మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వర రావు, డిటిసి ఆర్.సుశీల, జిల్లా వ్యవసాయ శాఖాధికారి డాక్టర్ ఎస్.శ్రీనివాస రావు, జిల్లా పౌర సరఫరాల అధికారి పద్మశ్రీ, జిల్లా పరిశ్రమల అధికారి శ్రీనివాసరావు, మైన్స్ డిడి రాజశేఖర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ముగిసిన మినీ బ్యాడ్మింటన్ పోటీలు

విజేతలకు బహుమతులు అందజేత

విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు లార్డ్ కృష్ణ ఇండోర్ స్టేడియంలో రాష్ట్ర స్థాయి అండర్-11 బాల బాలికల మినీ బ్యాడ్మింటన్ పోటీలు బుధవారంతో ముగిశాయి. చిన్నారులు నువ్వా నేనా అన్నట్లు పోటీ పడ్డారు. చిన్నారుల అద్వితీయ ప్రదర్శన ప్రేక్షకులను అబ్బురపరిచింది. బాల బాలికలు పదునైన షాట్స్, స్మాష్‌లతో తమ ప్రతిభను చాటారు. ముఖ్యంగా బాలికలు రాకెట్ నైపుణ్యాన్ని ప్రదర్శించి క్రీడాభిమానుల మన్ననలు పొందారు. చివరి రోజు ఉదయం సెమీ ఫైనల్స్ తరువాత ఫైనల్స్ హెూరాహెూరీగా జరిగాయి. అండర్ 11 బాలుర సింగిల్స్ ఫైనల్ మ్యాచ్‌లో అనంతపురంకు చెందిన ఏ. హర్షిత్, విశాఖపట్నంకు చెందిన కె.మోజెష్‌పై విజయం సాధించారు. అండర్-11 బాలికల సింగిల్ ఫైనల్ మ్యాచ్ లో కృష్ణ జిల్లా కు చెందిన కియా, ప్రకాశం జిల్లాకు చెందిన ఎస్.కే రబియాపై విజయం సాధించారు. బాలుర డబుల్స్ ఫైనల్ మ్యాచ్ లో ప్రకాశం జిల్లాకు చెందిన ఎస్‌కె ఆఫన్, ఎస్‌కె యాశీర్, తూర్పు గోదావరికి చెందిన శ్రీ రామ్ సహంత్, కె.కార్తీక్ సూర్య రాయ్‌పై గెలుపొందారు. బాలికల డబుల్స్ ఫైనల్ మ్యాచ్‌లో విశాఖపట్నంకు చెందిన ఎలియన్ ప్రియాంక్, శ్రీ ప్రవ్య, ప్రకాశం జిల్లాకు చెందిన ఎస్‌కె రబియా, కృష్ణా జిల్లాకు చెందిన కె.అధ్యపై విజయం సాధించారు. మూడు రోజుల పాటు క్రీడాభిమానులు సందడితో లార్డ్ కృష్ణ స్టేడియంలో పండగ వాతావరణ నెలకొంది. చిన్నారుల కళ్ళు చెదిరే షాట్స్ ప్రేక్షకులను కట్టిపడేశాయి. ఫైనల్ మ్యాచ్ లో గెలిచిన రన్నర్స్, విన్నర్స్‌కు లార్డ్ కృష్ణ బ్యాడ్మింటన్ అకాడమి చైర్మన్ శిద్దా సుధీర్ కుమార్ అభినందనలు తెలియజేశారు. విన్నర్స్, రన్నర్స్‌కు అకాడమి ఫౌండర్ ప్రెసిడెంట్ అద్దంకి మురళీ కృష్ణ ట్రోఫీలతో పాటు సర్టిఫికేట్స్ అందచేశారు. ఈ సందర్భంగా అద్దంకి మురళీ కృష్ణ మాట్లాడుతూ ఈ మ్యాచ్‌లో గెలుపొందిన విజేతలు జాతీయ స్థాయి టోర్నమెంట్‌కు క్వాలిఫై అయినట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ బ్యాడ్మింటన్ అసోసియేషన్, జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ సహకారంతో అండర్ 11బాల బాలికల మినీ బ్యాడ్మింటన్ పోటీలు లార్డ్ కృష్ణ అకాడమిలో నిర్వహించడం చాలా సంతోషంగా ఉందన్నారు. పోటీలలో పాల్గొన్న చిన్నారులకు, తల్లి దండ్రులకు, క్రీడాభిమానులు, కోచ్‌లకు, అసోసియేషన్ వారికి కృతజ్ఞతలు తెలియచేశారు. మున్ముందు మరిన్ని జాతీయ బ్యాడ్మింటన్ పోటీలు లార్డ్ కృష్ణ అకాడమిలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. క్రీడాకారులకు మెరుగైన శిక్షణ అందించేందుకు విదేశీ కోచ్‌లను ఏర్పాటు చేశామని, ఔత్సాహిక క్రీడాకారులు బ్యాడ్మింటన్ శిక్షణ ఇచ్చి వారిని ఉత్తమ బ్యాడ్మింటన్ క్రీడాకారులుగా తీర్చిదిద్దే బాధ్యత లార్డ్ కృష్ణ బ్యాడ్మింటన్ అకాడమి చేపట్టిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మ్యాచ్ చీఫ్ రెఫరి టి.కృష్ణ ప్రసాద్, అద్దంకి రాధాకృష్ణ మూర్తి, ప్రకాశం జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి విజయ కృష్ణ, లార్డ్ కృష్ణ బ్యాడ్మింటన్ అకాడమి అకాడమి కార్యదర్శి, ట్రెజరర్ ఏ.పద్మప్రియ, అకాడమి సభ్యులు రఘుబాబు, దండు శ్రీనివాసరావు, కోడె శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న ఎంపీ మాగుంట

గృహ, పట్టణ వ్యవహారాల కమిటీ సమావేశంలో మాగుంట

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఢిల్లీ పార్లమెంట్ భవనంలోని కమిటీ హాలులో గృహ, పట్టణ వ్యవహారాల పార్లమెంటరీ కమిటీ చైర్మన్, ఒంగోలు పార్లమెంటు సభ్యులు, మాగుంట శ్రీనివాసులురెడ్డి బుధవారం కమిటీ సభ్యులతో సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో రీజినల్ రాపిడ్ ట్రాన్సిట్ సిస్టం, నేషనల్ కాపిటల్ రీజియన్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (ఎన్‌సిఆర్‌టిసి) పాత్రపై కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రతినిధులతో చర్చించారు. కార్యక్రమ సంగ్రహ సమాచారం, సూచనలపై ఛైర్మన్, ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులురెడ్డి, కమిటీ సభ్యులు చర్చలు జరిపారు.

జెల్లివారి పుల్లలచెరువులో తాగునీటికి కటకట

మరమ్మతులకు గురైన బోర్లు

పట్టించుకోని అధికారులు, పాలకులు

తోపుడు బండిపై ఖాళీ బిందెలతో నీటి కోసం వెళ్తున్న గ్రామస్థుడు

ప్రజాశక్తి -రాచర్ల

వేసవి కాలానికి ఇంకా ఐదు నెలలు ఉన్నప్పటికీ రాచర్ల మండలం జెల్లివారి పుల్లలచెరువు గ్రామంలో తాగునీటికి గ్రామస్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. పగలంతా పొలాల్లో పనులు చేసుకుని రాత్రి ఇంటికి వచ్చి తాగటానికి నీళ్లు ఉండటం లేదని వాపోతున్నారు. గ్రామంలో చాలా సింగిల్ ఫేస్ మోటార్లు మరమ్మతులకు గురై నిరుపయోగంగా ఉన్నా పట్టించుకునే నాథుడే లేరని, నీటి సమస్య అధికంగా ఉందన్నారు. ఓవర్ హెడ్ ట్యాంక్‌కు మూడు మోటార్ బోర్లు ఉండగా ఒక మోటార్ బోర్ మాత్రమే పనిచేస్తుంది. మోటార్లు మరమ్మతులకు నోచుకోకపోవడంతో తాగునీటి కోసం ప్రజలు నానా అగచాట్లు పడుతున్నామన్నారు. గ్రామ సచివాలయం కేవలం మీసేవ కేంద్రంగా మాత్రమే పనిచేస్తోందని, ఏ అధికారీ నీటి సమస్య పట్టించుకోవటం లేదన్నారు. అసంపూర్తిగా మిగిలి పోయిన జలజీవన్ మిషన్ పనులు కూడా కలగానే మిగిలిపోయాయి. గత ప్రభుత్వంలో ఐదు సంవత్సరాలుగా చెరువులు నీటికి నోచుకోలేదు. కొత్త ప్రభుత్వం చెరువులు బాగు చేస్తారని ప్రజలు కొండంత ఆశతో ఎదురుచూస్తున్నారు. చెరువుల ఆధునికీకరణ కోసం ప్రణాళికలు తయారుచేసి ఎస్టిమేట్లు వేయమని ప్రభుత్వం అధికారులకు ఆదేశాలు జారీ చేసినప్పటికీ, సంబంధిత అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గ్రామంలో ప్రజల దాహార్తిని తీర్చాలని వేడుకుంటున్నారు.

మరమ్మతులకు గురైన బోరు

పూర్తిగా కాలిపోయిన పూరిల్లు

ఉప్పుగుండూరులో పూరిల్లు దగ్ధం

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

ఎగిసిపడుతున్న మంటలు

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధమైన సంఘటన మండలంలోని ఉప్పుగుండూరు గ్రామంలోని అంబేద్కర్ నగర్‌లో మంగళవారం అర్థరాత్రి జరిగింది. ఈ ఘటనలో కాలనీకి చెందిన నలతోటి రవికుమార్ (రత్నం)కు చెందిన పూరిల్లు పూర్తిగా కాలిపోయింది. స్థానికులు గమనించి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. దీంతో ఒంగోలు నుంచి అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి వచ్చి మంటలు అదుపు చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. ఇంట్లో దాచుకున్న రూ.50 వేలు నగదు, 3 సవర్లు బంగారం, 2 మొబైల్ ఫోన్లు, కుట్టు మిషన్, పూర్తిగా కాలిపోయాయి. మూగజీవాలకు సంబంధించిన గడ్డివామి కాలి బూడిదైంది. 3 గెదేలు, 3 దూడలు ఉండగా వాటిలో రెండు గేదలకు, మూడు దూడలకు స్వల్ప గాయాలు కాగా, ఒక గేదె పరిస్థితి విషమంగా ఉన్నట్లు బాధితుడు తెలిపారు. దీంతో సర్వం కోల్పోయి కట్టుబట్టలతో మిగిలామని భోరున విలపించారు. ఆరుగాలం కష్టపడి సంపాదించుకున్న సొమ్మంతా కళ్లెదుటే బూడిద పాలుకావడంతో బాధితుల ఆవేదన చూపరులను కంట తడి పెట్టించింది. ప్రభుత్వపరంగా కుటుంబాన్ని ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కుక్కల దాడిలో చిన్నారికి గాయాలు

ప్రజాశక్తి - మార్కాపురం రూరల్

గాయపడిన చందన్

వీధి కుక్కలు దాడి చేయడంతో చిన్నారికి గాయాలైన సంఘటన పట్టణంలోని ఏడో వార్డు పరిధిలోని గొర్లగడ్డ వీధిలో జరిగింది. ఈ దాడిలో చిన్నారి చందన్ తీవ్రంగా గాయపడ్డాడు. చందన్ తల్లిదండ్రులు బెంగాల్ రాష్ట్రం నుంచి కూలి పని నిమిత్తం మార్కాపురం పట్టణం వచ్చి గోర్లగడ్డ వీధిలో నివాసం ఉంటున్నారు. చిన్నారి చందన్ బుధవారం ఇంటిముందు ఆడుకుంటుండగా వీధి కుక్కలు ఒక్కసారిగా గుంపుగా వచ్చేసి మూకుమ్మడిగా దాడికి తెగబడ్డాయి. దొరికిన చోటల్లా దాడి చేయడంతో ఆ దృశ్యం చూసి స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు.

నగరంలో పెట్రేగిపోతున్న వీధి కుక్కలు

మార్కాపురం పట్టణంలో వీధి కుక్కలు పెట్రేగిపోతున్నాయి. నిత్యం పట్టణంలో ఏదో ఒక వార్డులో వీధి కుక్కలు వీరంగం సృష్టిస్తున్నాయి. తాజాగా ఏడో వార్డులో చందన్ అనే చిన్నారిపై దాడి చేసి గాయపరిచాయి. రెండు రోజుల క్రితం స్థానికంగా ఒక హోటల్లో పనిచేస్తున్న వంట మాస్టర్ తన పని ముగించుకుని ఇంటికి వెళ్తున్న క్రమంలో శునకాల గుంపు ఆ వ్యక్తిని ఉరుకులు.. పరుగులు పెట్టించాయి. నిత్యం రోడ్ల మీద సంచరిస్తున్న కుక్కలు పాదాచారులపై ప్రతాపం చూపుతున్నాయి. ఇంత జరుగుతున్నా మార్కాపురం పురపాలక శాఖ ఉన్న అధికారులు ఈ కుక్కల బెడదను పరిష్కరించడానికి తగిన చర్యలు తీసుకుంటున్న దాఖలాలు లేవని పురప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బయటకు రావాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని తిరగాల్సి వస్తుందని వాపోతున్నారు. ఇప్పటికైనా పురపాలక సంఘం అధికారులు, పాలకులు స్పందించి వీధి కుక్కల నియంత్రణకు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మార్కాపురంలో గుంపులుగా తిరుగుతున్న శునకాలు

ఎడ్లబండ్లపై ఇసుక రవాణాను ఆపొద్దు..

◆ ఆర్డీఓ కార్యాలయం వద్ద ధర్నా ◆ సిఐటియు జిల్లా అధ్యక్షులు మణిలాల్ మద్దతు

ప్రజాశక్తి - రేపల్లె

ఉచిత ఇసుక విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలు అమలు చేయకపోవటాన్ని నిరసిస్తూ స్థానిక ఆర్డీఓ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహించారు. అధికారుల వేధింపులు ఆపాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ మణిలాల్ డిమాండ్ చేశారు. సిఐటియు ఆధ్వర్యంలో ఎడ్లబళ్ల ముఠా కార్మికులు ధర్నా అనంతరం ఆర్డీఓ, డిఎస్పి కార్యలయాల్లో వినతి పత్రాలు అందజేశారు. ఆర్డీఓ కార్యలయం ఎదుట బైఠాయించిన ఎడ్లబళ్ల ముఠా కార్మికులు ఉచిత ఇసుక అనుమతించాలని, పోలీసు, రెవెన్యూ అధికారుల వేధింపులు ఆపాలని నినాదాలు చేశారు. ధర్నాలో సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ మణిలాల్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక అమలు కోసం స్పష్టంగా జిఒలో ఎడ్లబళ్ల ద్వారా ఇసుక తీసుకువెళ్లే వారిని ఆపవద్దని ముఖ్యమంత్రి చెబుతున్నప్పటికీ రేపల్లె నుండి వెళ్లి ఎడ్లబళ్ల ద్వారా ముఠా కార్మికులు కృష్ణానది, ఓలేరు తదితర లంకగ్రామాలు నుండి ఇసుక తీసుకువస్తుంటే ఓలేరు వద్ద భట్టిపోలు పోలీసులు, రెవిన్యూ అధికారులు, పెనుమూడి వద్ద పోలీసు ఎడ్లబళ్లు ఆపి ఇసుక రోడ్డుమీద పారబోపి చ్చటం, బెదిరించటం నిబంధనలకు విరుద్ధంగా చేస్తున్నార ని అన్నారు. గత పది రోజుల నుండి రేపల్లెలో ఇసుక ఎడ్లటైరుబళ్లని అనుమతించక పోవడంతో టైర్ బళ్ళ మీద ఆధారపడిన ఇసుక ముఠా కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. తక్షణం ఆర్డీఓ, డిఎస్పి ఉచిత ఇసుకను తరలించుకోవడానికి అనుమతించాలని కోరారు. లేని నేపధ్యంలో ఇసుక తరలించే ఎడ్లబళ్లలను ఎక్కడ ఆపితే అక్కడే ఎడ్లబళ్ళ ద్వారా బైఠాయించి ఆందోళన చేప డుతామని డిమాండ్ చేశారు.

ధర్నా నిర్వహిస్తున్న టైరుబండ్ల కార్మికులు

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ మణిలాల్

అధికారులు ఉద్దేశపూ ర్వకంగా ఎడ్లబళ్లను అనుమతించక పోతే ప్రజల మద్దతు కూడగట్టి ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ ప్రాంత ప్రజా ప్రతినిధులు ఎడ్లబళ్ళల ద్వారా ఉచిత ఇసుక పట్టణంలోకి అనుమతించే విధంగా చర్యలు తీసు కోవాలని కోరారు. తక్షణం ఎడ్లబళ్ళ ద్వారా ఇసుక తోలుకు నే వారిని ఎటువంటి ఆంక్షలు లేకుండా ఉచిత ఇసుక అను మతించాలని కోరారు. కార్యక్రమంలో ఎడ్లబండ్ల ఇసుక ముఠా వర్కర్ యూనియన్ (సిఐటియు అనుబంధం) నాయకులు జి రాఘవయ్య, పి వినోద్, ఎస్ గణేష్, టి రామయ్య, జె ధర్మరాజు, కె ఆశీర్వాదం, బి ఆగస్టిన్ పాల్గొన్నారు.

యుటిఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక

నూతనంగా ఎన్నికైన యుటిఎఫ్ కార్యవర్గం

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

యుటిఎఫ్ మండల నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యుటిఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులుగా మండలంలోని కోలలపూడి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు గాలి యెహెూషువ, ఇసుకదర్శి ఎంపిపి పాఠశాల ఉపాధ్యాయుడు కనగాల లక్ష్మి కాంత్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంలో జరిగిన ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ స్వర్ణోత్సవ వేడుకల సమావేశంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జె వినయ్ కుమార్, అడుగుల శ్రీనివాసరావు నూతన కమిటీ ఎన్నికను పరిశీలించారు. జిల్లా కోశాధికారి మచ్చ వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా బొబ్బేపల్లి జడ్పీ హై స్కూల్ ఉపాధ్యాయులు పెనుమాకల వెంకట్రా వు, ఉపాధ్యక్షులు కె జాకబ్, ఎస్ రమ, కోశాధి కారి అట్లూరి ప్రశాంత్, కార్యదర్శులుగా ఆర్ యలమంద య్య, అట్లూరి చార్లీ బెంజిమెన్, వివి రామాంజలి, శ్రీని వాసరావు, వసంతరావు, జానీ బాషా, వెంకటేశ్వర్లు, రామ కోటేశ్వరరావు, రామ నాయక్, నాగేశ్వరరావు, తాజుద్దీన్, పోపూరి శ్రీనివాసరావు, రమాదేవి, తవ్వ వాసుదేవరావు, జిల్లా కౌన్సిలర్లుగా బి ఆదినారాయణ, డి సునీల్ కుమార్, ఎస్ ఆంజనేయరాజు, ఎం ఈశ్వర ప్రసాద్, ఎస్ సత్యవర్తిని, షేక్ మౌలాలి, టి పేరయ్య, ఆడిట్ కన్వీనర్ ఎ సూర్య ప్రకాశరావు, సిపిఎస్ ప్రతినిధిగా డి ఏలీయా, మహిళా కన్వీనర్‌గా నూర్జహాన్‌ను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా యూటీఎఫ్ జిల్లా కార్యదర్శులు పాలపర్తి రామాంజనేయులు, పరిశీలకులుగా కందిమళ్ల రవిబాబు వ్యవహరించారు. రాష్ట్ర స్వర్ణోత్సవ క్రీడల్లో బాపట్ల జిల్లా నుండి విజేతలుగా నిలిచిన మార్టూరు, సంతమాగులూరు ఉపాధ్యాయులు అట్లూరి ప్రశాంత్, జిలాని, కె జాకబ్, జి రామకోటేశ్వరావు, జానీ బాషాను ఘనంగా సన్మానిం చారు. గత నాలుగేళ్లుగా యుటిఎఫ్ అధ్యక్ష, కార్యదర్శు లుగా సేవలందించిన బండారు ఆదినారాయణ, పోపూరి సునీల్ కుమార్‌ను అభినందించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు బత్తుల హనుమంతరావు, వలీఖాన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కనగాల లక్ష్మి కాంత్

గాలి యెహెూషువ

సమస్యల పరిష్కారం కోసం నేడు సిపిఎం ధర్నా

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

ధరల నియంత్రణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలేమి తీసుకోవడం లేదని, బాధ్యతలు విస్మరించి ప్రజలపై మరింత భారాలు మోపే పనిలో ప్రభుత్వాలు ఉన్నాయని సిపిఎం జిల్లా నాయకులు బత్తుల హనుమంతరావు ఆరోపించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 14న సిపిఎం చేపట్టిన ప్రజాపోరు ప్రచార యాత్రలో భాగంగా బుధవారం కరపత్రాల పంపిణి చేశారు. కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఉపాధి అవకాశాలు లేక ధరలు పెరుగుదలతో కుటుం బాలు గడవడం కష్టంగా ఉందన్నారు. సమస్యల పరి ష్కారం కోసం జిల్లా వ్యాప్తంగా తహశీల్దార్ కార్యాలయాల వద్ద జరగనున్న ధర్నాకు ప్రజలు తరలి రావాలని కోరారు. సిపిఎం నాయకులు ఎనికపాటి రాంబాబు, బొడెంపూడి సూరిబాబు పాల్గొన్నారు.

కారంచేడు : ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజాపోరు కార్యక్రమం సిపిఎం నిర్వహిస్తున్నట్లు సిపిఎం జిల్లా నాయకులు పి కొండయ్య పేర్కొన్నారు. ప్రజాపోరు ఆందోళనలో భాగంగా మండలంలోని స్వర్ణ గ్రామంలో కరపత్రాలతో ప్రచారం నిర్వహించారు. కరెంటు చార్జీలు పెంచబోమంటూ ట్రూ ఆఫ్ చార్జీల పేరుతో ప్రజలపై రూ.20 వేల కోట్ల భారం వేయడం, స్మార్ట్ మీటర్లు బిగించడం కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలకు భిన్నంగా వ్యవహరించడమేనని అన్నారు. భూ యజమానితో నిమిత్తం లేకుండా కౌలు గుర్తింపు కార్డులు ఇస్తామన్న హామీ నేటికీ నెరవేరలేదని అన్నారు. స్వర్ణ గ్రామంలోని మురుగు నీటిపారుదల సమస్య పరిష్కరిం చాలని అన్నారు. పంచాయితీలో జరిగిన నిధుల దుర్వినియోగం, హౌసింగ్ గృహాలు నిర్మించకుండా నిర్మించుకున్నట్లుగా నిధులు స్వాహా చేసిన వారిపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్సీ కాలనీ వద్ద కూలిపోయిన బ్రిడ్జిని వెంటనే నిర్మించాలని కోరారు. సిపిఎం నాయకులు సుబ్బారావు, పి ఏడుకొండలు, హనుమంతరావు పాల్గొన్నారు.

ప్రచారం నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు

వినతిపత్రం అందిస్తున్న సిఐటియు నాయకులు

108 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - బాపట్ల

అత్యవసర అనారోగ్య పరిస్థితుల్లో 108 సర్వీసులో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా నాయకులు పి కొండయ్య అన్నారు. 108 సర్వీసు ఉద్యోగులకు కనీస వేతనాల చెల్లింపుతో పాటు నాలుగేళ్ల క్రితం ఇచ్చిన ఒక ఇంక్రిమెంట్‌కు ఇవ్వాల్సిన 3ఇంక్రిమెంట్లు కలిపి నెల జీతం క్రమబద్ధీకరించి ఇవ్వాలని సిఐటియు ఆధ్వర్యంలో 108 ఉద్యోగులతో కలిసి వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఎస్ విజయమ్మకు బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన జిఒ ఎంఎస్ నెంబర్ 48 పునరుద్ధరించి జీతాలు క్రమ బద్ధీకరించి ఇవ్వాలని అన్నారు. 108 సేవలో పనిచేస్తున్న ఈఎంటిలను వైద్య కళాశాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల్లో నియమించాలని కోరారు. 108 సర్వీసులో 12 గంటల పాటు పని చేయడంతో పని భారం పెరిగి సిబ్బంది తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నారని అన్నారు. పని గంటలు క్రమబద్ధీకరించి వైద్య ఆరోగ్య శాఖలో వచ్చే ఖాళీలను తెలంగాణ తరహాలో వెయిటేజీ ఇచ్చి నియామకాలు జర పాలని కోరారు. తక్షణం పరిష్కరించ కపోతే ఈనెల 25నుండి సమ్మె బాట పడతామని అన్నారు. కలెక్టరు, డిఎంహెచ్ఓకు సమ్మె నోటీసులు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సముద్ర, కోటయ్య, స్కైలాబ్, రమేష్, సురేష్, సిఐటియు నాయకులు శరత్ పా ల్గొన్నారు.

విద్యుత్ విజిలెన్స్ అధికారుల దాడి

ప్రజాశక్తి - పంగులూరు

మండలంలో అక్రమంగా విద్యుత్తు వినియోగిస్తున్న 74మందిపై విజిలెన్స్ అధికారులు బుధవారం దాడి చేశారు. వీరి నుండి రూ.2.84లక్షల అపరాధ రుసుం విధించినట్లు విద్యుత్ జెఈ ఆంజనేయులు తెలిపారు. వీరిలో మీటర్ లేకుండా వినియోగించుకుం టున్న ఇద్దరిని, అనుమతి లేకుండా ఇతర కేటగిరీల్లో విద్యుత్తు వాడుకుంటున్న ఆరుగురిని, మీటరు ఉండి బైపాస్ చేసి అనధికారికంగా విద్యుత్ వాడుకుంటున్న మరో ఇద్దరిని, అధిక లోడుతో విద్యుత్ అక్రమంగా వాడుకుంటున్న 64 మంది కలిపి 74 మందికి చెందిన నివాసాలపై దాడి చేశామని చెప్పారు. కార్యక్రమంలో విద్యుత్ ఎస్ఈ జి ఆంజనేయులు, డిఇలు నల్లూరి మస్తాన్రావు, ఎం దామోదరం, ఎం సురేంద్రబాబు పాల్గొన్నారు.

మంత్రి గొట్టిపాటిని కలిసిన మణికేశ్వరం గ్రామస్థులు

మంత్రి గొట్టిపాటికి ఆహ్వానం

ప్రజాశక్తి - అద్దంకి

మండలంలోని మణికేశ్వరం గ్రామస్థులు మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను అమరావతి సచివాలయంలో బుధవారం కలిశారు. దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన మణికేశ్వరం శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి ఆలయంలో కార్తీక పౌర్ణమి వేడుకలకు మంత్రిని గ్రామస్తులు ఆహ్వానించారు. కార్యక్రమంలో ఈఒ వాసు, టిడిపి నేత షేక్ కరిముల్లా, అంజయ్య, బడావలి, మౌలాలి ఉన్నారు.

ఐదేళ్ల భవిష్యత్తుకు అడుగులు

ప్రజాశక్తి- మార్టూరు రూరల్

ఏలూరి సాంబశివరావు

వైసిపి అరాచక పాలనలో రాష్ట్రంలో అన్ని రంగాలు అస్తవ్యస్తం అయ్యాయని, ముందు చూపు కలిగిన విజనరీ లీడర్ చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలోని వ్యవస్థలన్నీ గాడిలో పడుతున్నాయని ఎంఎల్ఎ ఏలూరి సాంబశివరావు శాసన సభలో అన్నారు. 2047 నవ్యాంధ్ర విజన్ డాక్యుమెంట్‌తో రాష్ట్రం అభివృద్ధి దిశగా పరుగులు పెడుతుందని అన్నారు. ప్రజల ఆకాంక్షలు, ఆశల కనుగుణంగా ఉందని పేర్కొన్నారు. వైసిపి పాలనకు ప్రస్తుత ప్రభుత్వ పాలనకు వ్యత్యాసాన్ని అసెంబ్లీ వేదికగా వివరించారు. వైసిపి పాలనలో రద్దు చేసిన పథకాలన్నీ పునరుద్ధరిస్తున్నట్లు తెలిపారు.

ప్రజా ప్రతినిధులతో అధికారులు

అభివృద్ధి ప్రణాళిక రూపొందించాలి

ప్రజాశక్తి - భట్టిప్రోలు

గ్రామాల్లో ఆర్థిక, సామాజిక అభివృద్ధికి మెరుగైన అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలని ఎంపిపి డివి లలిత కుమారి సర్పంచులు, ఎంపిటిసిలు, అధికారులను కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ మీటింగ్ హాలులో బుధవారం నిర్వహించిన శిక్షణ సమావేశంలో ఆమె మాట్లాడారు. మానవ వనరులు, ఆర్థిక వనరులను ఉపయోగించుకుని అన్ని శాఖలు సమన్వయంతో అభివృద్ధికి పాటుపడే విధంగా ప్రణాళికలు రూపొందించాలని కోరారు. ఆయా ఆన్లైన్ పోర్టల్ నందు పొందుపర్చాలని తెలిపారు. మాస్టర్ ట్రైనర్లు వక్కలగడ్డ సురేష్, ఎ చిన వెంకటేష్ బాబు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎస్ వెంకటరమణ, ఈఓపిఆర్ అండ్ ఆర్డి టి ఊహారాణి, సర్పంచులు, ఎంపిటిసిలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నేడు వెయిట్ లిఫ్టింగ్ పోటీలు

ప్రజాశక్తి - వేటపాలెం

స్థానిక బిబిహెచ్ డిగ్రీ కళాశాల నందు ఆంధ్ర కేసరి యూనివర్సిటీ ఆధ్వర్యంలో వెయిట్ లిఫ్టింగ్ ఇంటర్ కాలేజే టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ జి ఆదిలక్ష్మి బుధవారం తెలిపారు. గురువారం ఉదయం నుండి బాలుర, బాలికల వెయిట్ లిఫ్టింగ్ పోటీలు ప్రారంభం అవుతాయని అన్నారు. పోటీలకు ఆంధ్ర కేసరి యూనివర్సిటీ అనుసంధాన డిగ్రీ, పీజీ, బీఈడీ కాలేజీలకు చెందిన విద్యార్థులు హాజరుకానినట్లు చెప్పారు.

వినతిపత్రం అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

ఉపాధ్యాయ సమస్యలు వెంటనే పరిష్కరించాలని యర్రగొండపాలెం మండల యూటిఎఫ్ నూతన అధ్యక్షుడు ఎం శ్రీనివాసులు ఆధ్వర్యంలో యర్రగొండపాలెం పట్టణంలోని విద్యావనరుల కేంద్రంలో మండల విద్యాశాఖాధికారులు పి ఆంజనేయులు, ఎస్ మల్లు నాయకలను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూటిఎఫ్ మండల అధ్యక్షుడు ఎం శ్రీనివాసులు మాట్లాడుతూ మండలంలో పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎంఈవోలు అభినందించారు. కార్యక్రమంలో యూటిఎఫ్ నాయకులు కృష్ణమూర్తి, శ్రీనివాసరావు, దుర్గా ప్రసాద్, పిసిహెచ్ కృష్ణారావు, బాబులాల్ నాయక్, నాగయ్య, శ్యాంరాజు, రవికుమార్, జిలాని బాషా, మంత్రు నాయక్, భాస్కర్, మస్తాన్‌రావు, యేసా నాయక్ పాల్గొన్నారు.

పొలం పిలుస్తోంది కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు

వాదంపల్లిలో 'పొలం పిలుస్తోంది'

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం మండలంలోని వై కొత్తపల్లి, వాదంపల్లి గ్రామాల్లో గ్రామ రైతు సేవ కేంద్రాలలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ముందుగా సాగులో ఉన్న కంది, మినుము, మిరప పంటలను క్షేత్రస్థాయిలో సందర్శించారు. అనంతరం గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి కేవి.శేషారెడ్డి మాట్లాడుతూ రబీలో సాగు చేస్తున్న మినుము, శనగ మొక్కజొన్న, జొన్న, మిరప పంటలకు రైతులే పంటల బీమా పథకం చెల్లించాలన్నారు. ఇన్సూరెన్స్ చేయించుకునే రైతులు పొలం పాస్ బుక్ జిరాక్స్, ఆధార్ కార్డు, బ్యాంకు పాస్ బుక్, ఫోన్ నెంబర్, పంట నమోదు సర్టిఫికెట్ తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు ఎల్ మాల్యాద్రి రెడ్డి, డి ధనేశ్వర నాయక్, విఎఏలు టి కష్టవేణి, సిహెచ్ వివేక్ శిశిర పాల్గొన్నారు.

కార్తీక వనభోజనాలు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం పట్టణంలో యక్కలివారివీధిలో వేంచేసి ఉన్న శ్రీ జగద్గురు మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి 416వ జయంతి బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్తీక వనభోజన కార్యక్రమం చేపట్టారు. ఇమ్మడిశెట్టి రామలక్ష్మమ్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంఘం ఉపాధ్యక్షులు ముత్తులూరి మల్లికార్జునచారి, మాజీ సర్పంచ్ కంచర్ల సత్యనారాయణ గౌడ్, మండల విశ్వబ్రాహ్మణ సంఘం కన్వీనర్ జమ్మోజు వెంకటేశ్వరచారి, లింగాల భవాని శంకర్ పాల్గొన్నారు

మొక్కలతో 'చిల్డ్రన్స్ డే' వచ్చేలా రూపొందించిన చిన్నారులు

బాలల దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు, మంగమూరు రోడ్డులోని ఫ్రీడమ్ బర్డ్స్ స్కూల్‌లో బాలల దినోత్సవం సందర్భంగా బుధవారం పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు వాళ్ళ పెంచిన మొక్కలతో 'చిల్డ్రన్స్ డే' అక్షరాలు వచ్చేలా రూపొందించి..ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ నాయుడు మాల్యాద్రి, సిబ్బంది పాల్గొన్నారు.

మతోన్మాదాన్ని రెచ్చగొడుతున్న మోడీ

సిపిఎం రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ జాలా అంజయ్య

మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ జాలా అంజయ్య

ప్రజాశక్తి-సిఎస్‌పురం రూరల్

ప్రధానమంత్రి నరేంద్రమోడీ మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ తన రాజకీయ స్వలాభం కోసం, అధికారాన్ని నిలబెట్టుకోవడం కోసం ప్రజల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నాలు చేస్తున్నారని సిపిఎం రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ జాలా అంజయ్య అన్నారు. సిపిఎం ఆరో మండల మహాసభ బుధవారం సిఎస్‌పురంలో సన్నపురెడ్డి తిరుపతిరెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం జెండాను సన్నపురెడ్డి తిరుపతిరెడ్డి ఆవిష్కరించారు. ఈ మహాసభలో ముఖ్యఅతిథిగా జాలా అంజయ్య మాట్లాడుతూ నరేంద్రమోడీ పాలనలో దేశం అప్పుల ఊబిలో కూరుకుపోతోందన్నారు. నెహ్రూ పాలన నాటి నుంచి 2014 వరకు ప్రభుత్వ అప్పు రూ.55 లక్షల కోట్లు మాత్రమే ఉండగా నరేంద్ర మోడీ 10 సంవత్సరాల పాలనలో రూ.1.60 కోట్లకు చేరిందన్నారు. ప్రజలకు విద్య, వైద్యం ఉచితంగా ఇవ్వాలని రాజ్యాంగం చెబుతుండగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్య, వైద్య రంగాలను వ్యాపార రంగంగా మార్చి.. ప్రైవేట్ విద్యను ప్రోత్సహిస్తూ పేదలకు విద్యను దూరం చేస్తున్నాయన్నారు.

మోడీ చెప్పినట్లు ఆడుతున్నారు..

జగన్ పాలనపై అసంతృప్తితో ఉన్న రాష్ట్ర ప్రజలు చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ఏదో చేస్తారన్న ఆశతో కూటమి ప్రభుత్వానికి ఓట్లు వేశారని, అయితే చంద్రబాబునాయుడు, పవన్‌కళ్యాణ్ ప్రజలకు మేలు చేయడం మరిచి నరేంద్రమోడీ ఆడమన్నట్లు ఆడుతున్నారన్నారు. పవన్‌కళ్యాణ్ మరో అడుగు ముందుకు వేసి సనాతన ధర్మం అంటూ అంటరానితనాన్ని ప్రోత్సహించే విధంగా మాట్లాడుతున్నారని విమర్శించారు. ఉచిత గ్యాస్ పేరుతో ప్రభుత్వం రూ.2600 కోట్లు ఖర్చు చేస్తూ విద్యుత్ ట్రూ అప్ చార్జీల పేరుతో రూ.18 వేల కోట్లు ప్రజల నుంచి వసూలు చేస్తున్నారన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు సామాన్య ప్రజానీకానికి అందనంతగా పెరిగిపోయాయన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం రమేష్, సిఎస్‌పురం, పామూరు మండలాల కార్యదర్శులు ఊసా వెంకటేశ్వర్లు, కే మాల్యాద్రి, ఎం రత్నారెడ్డి, ఊసా రాజ్యలక్ష్మి, షేక్ అజీద్ బాషా, బి జేసురత్నం, డోలా తిరుపతయ్య, అంకెపల్లి వెంకటేశ్వరరెడ్డి, పి కొండమ్మ, కొండా కళమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయం చూపాలని వినతి

తహశీల్దార్‌కు అర్జీ ఇస్తున్న యూనియన్ నాయకులు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

తాము షాపులు నిర్వహించుకునేందుకు ప్రత్యామ్నాయ స్థలం చూసి ప్రస్తుతం ఉన్న స్థలాలను ఖాళీ చేయించాలని 60 కుటుంబాలకు చెందిన ఆటో యూనియన్ నాయకులు బుధవారం తహశీల్దార్ ఎ.బాలకిశోర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆటో యూనియన్ కార్మికులు మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా తాము యర్రగొండపాలెం పట్టణంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాల ప్రహరీ గోడ దగ్గర బంకులు పెట్టుకొని చేతి వృత్తులను చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని తెలిపారు. అయితే ప్రస్తుతం ఉన్న పాత ప్రహరీ గోడ తొలగించి కొత్త గోడను కట్టించాలనే సాకుతో తమ బంకులు తొలగించాలని చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో తమ బతుకులు రోడ్డున పడే అవకాశం ఉందని వాపోయారు. ప్రత్యామ్నాయ స్థలం చూపి తమ బంకులు తొలగించాలని కోరుతున్నా తమ గోడు ఎవరు పట్టించుకోవడం లేదని వాపోయారు. ప్రత్యామ్నాయం చూపకుండా బంకులు తొలగిస్తే తమ కుటుంబాలు జరగడం కూడా కష్టమేనన్నారు. తమ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ప్రత్యామ్నాయ స్థలాలు చూపాలని ఆటో నగర్ కార్మికులు తెలిపారు. స్పందించిన తహశీల్దార్ బాల కిశోర్ మాట్లాడుతూ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తానని చెప్పారు. కార్యక్రమంలో రఫి, షాకీర్, బాషా, కుమార్, దేవయ్య, గురు బ్రహ్మం, చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

మండలంలోని ప్రజా ప్రతినిధులు, అధికారులు పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపిడివో నాసర్‌రెడ్డి తెలిపారు. బుధవారం పెద్దదోర్నాలలోని ఎంపిడివో కార్యాలయంలో గ్రామ పంచాయతీల అభివృద్ధి పై రాష్ట్రీయ గ్రామ్ స్వరాజ్ అభియాన్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాసర్‌రెడ్డి మాట్లాడుతూ పంచాయితీకి కావాల్సిన నిధులు అందించేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ప్రభుత్వం మంజూరు చేసే నిధులతో గ్రామ పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులు, ఎంపిటిసిలు, సర్పంచ్‌లకు రంగయ్య శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శనగ, మిరప పంటల పరిశీలన

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

మండలంలోని ఐనముక్కల, తిమ్మాపురం గ్రామాలలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. సాగులో ఉన్న శనగ, మిరప పంటలను సందర్శించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి డి.జవహర్‌లాల్ నాయక్ మాట్లాడుతూ ప్రధాన మంత్రి ఫసల్ భీమా పథకం గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిఎవో వెంకటేశ్వర్లు, ఏఈవో చైతన్య కుమార్, సిబ్బంది సుస్మిత, శివ నాయక్, రైతులు పాల్గొన్నారు.

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

పెద్దదోర్నాలలోని శాఖా గ్రంథాలయ ఆధ్వర్యంలో ఈనెల 14వ తేది నుంచి 20వ తేది వరకు 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు గ్రంథపాలకుడు డి వెంకట సుబ్బారెడ్డి తెలిపారు. 14వ తేదిన బాలల దినోత్సవం, 15వ తేదిన పుస్తక ప్రదర్శన, 16 వ తేదిన గ్రంథాలయ ఉద్యమకారుల జీవిత చరిత్రలు వివరించుట, 17 వ తేదిన కవి సమ్మేళనం, 18 వ తేదిన ముగ్గుల పోటీలు, 19 వ తేదిన క్విజ్ పోటీలు, 20 వ తేదిన ముగింపు సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు.

నేటి నుంచి ఉచితంగా కంటి పరీక్షలు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

స్థానిక అంజయ్యరోడ్డులోని సర్వనేత్రాలయ రెటీనా హాస్పిటల్‌లో బాలల దినోత్సవం సందర్భంగా చిన్నారులకు ఈ నెల 14 నుంచి 30 వరకు ఉచితంగా కంటి వైద్యపరీక్షలు నిర్వహించనున్నట్లు రెటీనా స్పెషలిస్ట్ డాక్టర్ పెనుమెచ్చ మానస ఒక ప్రకటనలో తెలిపారు. చిన్నారుల కళ్లజోళ్లపై 30 శాతం డిస్కౌంట్ ఇస్తామని హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ ఉప్పలపాటి శ్రీనివాసులు పేర్కొన్నారు.

అపార్‌కు 'ఆధార్' అడ్డంకులు

- సర్వర్ ఇబ్బందులతో పనిచేయని కేంద్రాలు
- అవస్థలు పడుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

విద్యార్థులకు వన్ నేషన్-వన్ ఐడీ కార్డు పేరుతో ప్రభుత్వం అపార్ (ఆటోమేటిక్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) కార్డుకు శ్రీకారం చుట్టింది. విద్యార్థులకు సంబంధించి పాఠశాలలో ఉన్న వివరాలు కాకుండా ఆధార్ కార్డులో ఉన్న వివరాలు కీలకమని చెప్పింది. దీంతో ఆధార్‌లో చేర్పులు, మార్పుల కోసం విద్యార్థులు ఆధార్ కేంద్రాల చుట్టూ తిరుగుతున్నారు. విద్యార్థులందరికీ కార్డులు ఉన్నప్పటికీ అందులో పుట్టిన సంవత్సరం మాత్రమే ఉండటం, తేదీలు లేకపోవడంతో అపార్ నమోదు ప్రక్రియలో వారి వివరాలు నమోదు కావడం లేదు. దీంతో చేర్పులు, మార్పుల కోసం ఆధార్ కేంద్రాలను ఆశ్రయిస్తున్నారు. మరో వైపు సర్వర్ సమస్యతో ఆధార్ నమోదు ప్రక్రియ జరగడం లేదు. గత ప్రభుత్వం వరకు గ్రామ సచివాలయాల్లో సక్రమంగా పని చేసిన ఆధార్ కేంద్రాలు ఇప్పుడు సర్వర్ సమస్యలతో నత్తనడకన సాగుతోంది. యర్రగొండపాలెం పట్టణంలో ఆధార్ కేంద్రంలో సర్వర్ సమస్యతో సక్రమంగా కొనసాగడం లేదు. మండల వ్యాప్తంగా 14 వేల మంది ఆధార్‌లో తప్పులు, ఒప్పులు సరి చేసుకోవాల్సి ఉంది. ఇప్పటి వరకు ఆరు వేల మంది విద్యార్థులు మాత్రమే సరి చేశారు. ఇంకా ఎనిమిది వేల మంది విద్యార్థుల ఆధార్ కార్డులు సరి చేయాల్సి ఉంది. దీంతో ఆధార్ నమోదుకు రోజుల తరబడి నిరీక్షించాల్సిన దుస్థితి చోటు చేసుకుంది. ఇప్పటికైనా అధికార యంత్రాంగం స్పందించి ఆధార్ నమోదు కేంద్రాలను పెంచడంతో పాటు అవి సక్రమంగా జరిగే విధంగా చూడాలని విద్యార్థులు కోరుతున్నారు.

ఆధార్ అప్‌డేట్ చేయించుకుంటున్న దృశ్యం

ఇబ్బందులు పడుతున్నాం..

ప్రేమ కుమారి, పదో తరగతి, అమానుగుడిపాడు

నా ఆధార్‌లో పుట్టిన సంవత్సరం మాత్రమే ఉంది. పుట్టిన తేదీ చేర్చడానికి ఆధార్ కేంద్రానికి వస్తే సర్వర్ సమస్య ఉందని చెబుతున్నారు. అపార్ నమోదు కోసం ఆధార్ కార్డులో వివరాలు పక్కాగా ఉండాలని ఉపాధ్యాయులు చెబుతున్నారు. ఆధార్ కేంద్రాలు సక్రమంగా పనిచేస్తే మాకు ఇబ్బందులు ఉండవు.

అపార్ కోసం అగచాట్లు

పాటిబండ్ల సాగరిక, ఏడో తరగతి, మురారిపల్లి

ఆధార్ కార్డులో తప్పులను సరి చేయించుకునేందుకు గత వారం రోజులు నుంచి యర్రగొండపాలెం వస్తున్నాను. సర్వర్ సక్రమంగా పని చేయడం లేదు. అధికారులు స్పందించి ఆధార్ కేంద్రాలను పెంచడంతో పాటు సర్వర్ సమస్యను పరిష్కరించాలి.

తెగుళ్ల నివారణకు చర్యలు తీసుకోవాలి

మాట్లాడుతున్న అద్దంకి ఎఒ కొర్రపాటి వెంకటకృష్ణ

మాట్లాడుతున్న చెరుకుపల్లి ఎఒ టి బాలాజీ గంగాధర్

ప్రజాశక్తి - అద్దంకి

వరిలో అగ్గి తెగులు పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని ఎఒ కొర్రపాటి వెంకటకృష్ణ సూచించారు. మండలంలోని కలవకూరు, సింగరకొండపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు అగ్గి తెగులు, రసం పీల్చు పురుగులకు అనుకూలంగా ఉన్నదని అన్నారు. రాత్రి ఉష్ణగ్రతలు తక్కువగా ఉండి చల్లని గాలులు వీచే సమయంలో అగ్గితెగులు ఉధృతి ఎక్కువగా వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఎఇఒ మస్తానరావు, తూమాటి సాయి బాబు పాల్గొన్నారు.

పర్చూరు : పోగాకు పంట బదులు శనగ, మినుము, మొక్కజొన్న, జొన్న పంటలు సాగుచేయాలని ఎడిఎ మోహనరావు అన్నారు. పర్చూరు, ఉప్పుటూరు గ్రామాల్లో బుధవారం జరిగిన పొలం బడిలో మాట్లాడారు. పొగాకు పంట సబ్‌డివిజన్‌లో ఎక్కువ విస్తీర్ణంలో వేయటం వలన మానవుల ఆరోగ్యం మీద ప్రభావం చూపుతుందని అన్నారు. పంట ఉత్పత్తి పెరిగితే కొనుగోళ్లు చేయటం కష్టమవుతుందని అన్నారు. ఎఒ రామ్మోహనరెడ్డి మాట్లాడుతూ శనగలో వచ్చు విల్ట్ తెగుళ్ల రకాలు, విత్తన శుద్ధి గురించి వివరించారు. విఎఎ ఆశా, సౌమ్య, అరుణ, ఫిలీప్, శ్రీకాంత్, టీడీపీ కన్వీనర్ షంషుద్దీన్, శివ నాగేశ్వరరావు, సుబ్బయ్య, పోతురాజు పాల్గొన్నారు.

ఇంకొల్లు : పొగాకుకు ప్రత్యామ్నయ పంటలు ఆగు చేసుకోవాలని ఎఒ పి వేణుగోపాల్ తెలిపారు. మండలంలోని హనుమోజిపాలెంలో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. పొగాకు విస్తీర్ణం పెరిగితే ధరలు తగ్గి రైతులు నష్టపోయే అవకాశం ఉందని అన్నారు. గతేడాది ధరను చూసి ఆశపడి సాగు విస్తీర్ణం పెంచవద్దని చెప్పారు. రైతులు తమ పంటలు సాగు చేసిన అనంతరం ఆ పంటలను సంబంధిత రైతు భరోసా కేంద్రంలో పంట నమోదు చేయించుకోవటం తప్పనిసరిగా చేయాలని సూచించారు.

కారంచేడు : రైతులందరూ తాము పండించే పంటలకు ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకంలో నమోదు చేసుకోవాలని ఎఒ సుదీర్ బాబు అన్నారు. మండలంలోని స్వర్ణ, కొడవాలివారిపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. శనగ వేసే రైతులు తప్పనిసరిగా విత్తన శుద్ధి ఎవర్ గోల్డ్ 100 లీటర్లు ఒక ఎకరాకు పిచికారీ చేసుకోవాలని అన్నారు. బ్యాంకు రుణం లేని సాగుదారులు కామన్ సర్వీస్ సెంటర్ ద్వారా ప్రీమియం కట్టి పంటల భీమా పరిధిలోనికి రావచ్చని తెలిపారు. మార్కెట్ యార్డ్ సిబ్బంది నారాయణ, గ్రామ వ్యవసాయ సహాయకులు బిందు మాధురి, పి దుర్గారావు, శారదా పాల్గొన్నారు.

చెరుకుపల్లి : రైతులకు అవసరమైన సూచనలు సలహాలు ఇచ్చేందుకు పొలం బడి నిర్వహిస్తున్నట్లు ఎఒ టి బాలాజీ గంగాధర్ అన్నారు. మండలంలోని బలుసులపాలెం, తుమ్మలపాలెం గ్రామాల్లో బుధవారం పొలం బడి నిర్వహించారు. వరి పైరులను పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. వరిలో కంకి నల్లి సమస్య అధికంగా ఉందని, మారిన వాతావరణ పరిస్థితుల దృష్ట్యా కంకినల్లి ఏర్పడడం వలన తాలు కంకులు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. దీని నివారణకు ప్రొఫెనోపాస్ లేదా స్పైరో మెఫిసిన్ మందులను పిచికారి చేయాలని సూచించారు.

కర్లపాలెం : వరి పునరుత్పత్తి దశలో పొలంలో నీరు ఉండేలా చూసుకోవాలని ఎఒ సుమంత్ కుమార్ అన్నారు. కర్లపాలెం, బుద్దాం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. వరి చిరుపొట్ట దశలో ఉన్నందున నత్రజని ఎరువుతో పాటుగా పొటాష్ ఎకరాకు 20కేజీల చొప్పున వేసుకోవాలని చెప్పారు. వరి పునరుత్పత్తి దశలో పొలంలో నీరు ఉండేలా చూసుకోవడం ముఖ్యమని తెలిపారు. అగ్గి తెగులు సోకే అవకాశం ఉంటుందని అన్నారు. రబీలో పంట వేసిన వారు నమోదు చేయించుకోవడానికి ఈ నెల 17 నుండి సైట్ అందుబాటులో ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో విస్తరణ అధికారి భాగ్యలక్ష్మి, విఎఎ భ్రమరాంబ, బాజి పాల్గొన్నారు.

పంగులూరు : సాంకేతిక పద్ధతులు అవలంభించడం ద్వారా అతి తక్కువ ఖర్చుతో అధిక ఫల సాయం సాధించి, ఆర్థిక అభివృద్ధి సాధించవచ్చని ఎఒ డి సుబ్బారెడ్డి అన్నారు. రేణంగివరం, కశ్యపురం గ్రామాల్లో పొలం పిలు స్తుంది కార్యక్రమం నిర్వహించారు. రైతులు సాగుచేసిన వరి, మినుము పంటలు పరిశీలించారు. గ్రామసభ నిర్వించారు. సమవేశంలో రైతు సేవా సిబ్బంది శివాని, ఎఇఒ ప్రభాకరరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కర్లపాలెం ఎఒ సుమంత్ కుమార్

మాట్లాడుతున్న పర్చూరు ఎడిఎ మోహనరావు

సోలార్ కనెక్షన్ దరఖాస్తులు అందిస్తున్న దృశ్యం

సోలార్ కనెక్షన్ల కోసం దరఖాస్తులు

ప్రజాశక్తి - పంగులూరు

ప్రధాన మంత్రి సోలార్ ఘర్ బిజిలి యోజన పథకం ద్వారా నివాస గృహాలకు నాణ్యమైన విద్యుత్ వినియోగించుకోవచ్చని ఎపి సిపిడిసిఎల్ ఎస్ఈ జి ఆంజనేయులు అన్నారు. మండలంలోని ముప్పవరంలో పలువురు వినియోగదారులకు సోలార్ విద్యుత్ పట్ల అవగాహన కల్పించారు. ముప్పవరంలో కొంత మంది వినియోగదారులకు సోలార్ కనెక్షన్ల కోసం అప్లికేషన్లను రిజిస్ట్రేషన్ చేశారు. కార్యక్రమంలో ఈఈ నల్లూరి మస్తానరావు, అద్దంకి డిఇఇ ఎం దామోదరం, ముప్పవరం ఎఈ పి ఆంజనేయులు, వి బాల కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఎంపికైన విద్యార్థులతో వనమ రామకృష్ణరావు

వెయిట్ లిఫ్టింగ్ టీం ఎంపిక

ప్రజాశక్తి - వేటపాలెం

స్థానిక సెయింట్ ఆన్స్ ఇంజినీరింగ్ కాలేజీలో కాకినాడ జెఎన్‌టియు వెయిట్ లిఫ్టింగ్ స్త్రీ, పురుషుల జట్లను బుధవారం ఎంపిక చేశారు. ఇంటర్ కాలేజ్ టోర్నమెంట్, యునివర్సిటి టీం సెలక్షన్స్ ప్రారంభించినట్లు కళాశాల సెక్రటరి వనమా రామకృష్ణా రావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు తెలిపారు. జట్లను ఎంపిక చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె జగదీష్ బాబు తెలిపారు. ఐకాన్ హాస్పటల్ అధిపతి శంకరశెట్టి కొండలరావు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. కాకినాడ జెఎన్‌టియు పరిధిలోని కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. విద్యార్థులకు వసతి, భోజన ఏర్పాట్లు చేసినట్లు కళాశాల పిడి అన్నం శ్రీనివాసరావు తెలిపారు. కాకినాడ జెఎన్‌టియు నుండి ఎన్ శేషగిరిరావు పరిశీలకులుగా వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో డైరక్టర్ సి సుబ్బారావు, ఆర్‌వి రమణ మూర్తి, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

బహుమతి అందజేస్తున్న హెచ్‌ఎం షేక్ కరిముల్లాబేగ్

కాంప్లెక్స్ పోటీల్లో మొదటి స్థానం

ప్రజాశక్తి - నిజాంపట్నం

మండలంలోని చింకపాలెం జెడ్‌పి ఉన్నత పాఠశాలలో ఈ నెల 12న జరిగిన కాంప్లెక్స్ స్థాయి స్పోర్ట్స్ పోటీల్లో భాగంగా నిర్వహించిన మ్యూజికల్ చైర్స్ పోటీలో కోపూరివారిపాలెం ఉర్దూ ప్రాథమిక పాఠశాలకు చెందిన ఐదో తరగతి విద్యార్థి షేక్ ఫరూక్ మొదటి స్థానంలో నిలిచాడు. బహుమతి, ప్రశంసా పత్రాన్ని హెచ్‌ఎం షేక్ కరీముల్లా బేగ్ బుధవారం అందజేసి అభినందంచారు.

తెలుగుదేశం సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి - చెరుకుపల్లి

తెలుగుదేశం కార్యకర్తలకు వెన్నంటి ఉంటుందని తెలుగుదేశం సీనియర్ నాయకులు ఎంఆర్‌కె మూర్తి అన్నారు. తెలుగుదేశం సభ్యత నమోదును బుధవారం చెరుకుపల్లిలో నిర్వహించారు. కార్యక్రమంలో పున్నారావు, వెంకటేశ్వరరావు, బోలగాని సుబ్బారావు పాల్గొన్నారు.

ఆంగ్ల విభాగం ఆధ్వర్యంలో వెబినార్

ప్రజాశక్తి - రేపల్లె

స్థానిక ఎబిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆంగ్ల విభాగం ఆధ్వర్యంలో ఆంగ్ల భాషలో జాతీయ స్థాయి వెబినార్ బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ టిసి రవి చంద్ర కుమార్ వెబినార్ ప్రారంభించారు. శాస్త్ర సాంకేతికతలో వచ్చిన వినూత్న మార్పులు బోధనలో కూడా రావాలని అన్నారు. ఆంగ్ల అధ్యాపకులు తగిన విధంగా తర్ఫీదు పొంది విద్యార్థులకు మేలు చేయాలని కోరారు. ఆంగ్ల భాష నేర్చుకోవటం ద్వారా మరిన్ని ఉద్యోగ అవకాశాలను పొందవచ్చని తెలిపారు. తెలంగాణకు చెందిన కాకతీయ ప్రభుత్వ కళాశాల, హనుమకొండ నుండి డాక్టర్ ఇ రామ్ భాస్కర్ రాజు వెబినార్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

వెబినార్‌లో మాట్లాడుతున్న అధ్యాపకులు

ఆంగ్ల భాష బోధనలో వస్తున్న నవీన పోకడలు తెలిపారు. కర్ణాటక రాష్ట్రానికి చెందిన శ్రీ కృష్ణ విజయ దేవర యూనివర్సిటీ నుండి డాక్టర్ చాంద్ బాషా 2వ వ్యాఖ్యాతగా వ్యవహరించి ప్రాంతీయ భాషల్లో ఎంతో సాహిత్యం దాగి ఉందని, దానిని అర్థం చేసుకోవటానికి ఆంగ్ల భాష సహాయకారిగా ఉంటుందని తెలిపారు. విద్యార్థులు సాహిత్యం మీద మక్కువ పెంచుకుంటే భాషపై పట్టు సాధించవచ్చని తెలిపారు. సదస్సులో ఇంగ్లీష్ విభాగ అధిపతి కాసుల బాలగురవయ్య మాట్లాడుతూ దేశం నలు మూలల నుండి సదస్సుకి పరిశోధక విద్యార్థులు, విద్యావేత్తలు హాజరు అయ్యారని, తద్వారా ఆంగ్ల విద్యలోని మెళకువలు తెలుసుకున్నారని పేర్కొన్నారు.

ప్రత్యేక అవసరాల పిల్లలకు వైద్యపరీక్షలు

ప్రజాశక్తి - అద్దంకి

సింగరకొండ రోడ్డులోని బదుల మానసిక దివ్యాంగుల ఆశ్రమ పాఠశాలను జిల్లా ఎర్లీ ఇన్వెన్షన్ సెంటర్ బృంద సభ్యులు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్విషన్ ఆఫీసర్ డాక్టర్ వెంకటేశ్వర్లు బదిరుల పాఠశాల్లోని చెవిటి, మూగ విద్యార్థులకు వైద్య పరీక్షల నిర్వహించారు. కొంత మంది విద్యార్థులను హయ్యర్ సెంటర్‌కు సూచించారు. కార్యక్రమంలో యుపిహెచ్‌సి కాకానిపాలెం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎం హేమమాధురి, వైద్య సిబ్బంది, బదిరుల పాఠశాల నిర్వాహకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షల నిర్వహిస్తున్న దృశ్యం

రైలు ఢీకొని వ్యక్తి దుర్మరణం

విజయనగరకాలనీలో విషాదం

ప్రజాశక్తి - చీరాల

మార్క్ (ఫైల్ ఫోటో)

రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని విజయనగర కాలనీ వద్ద బుధవారం వేకువ జామున జరిగింది. కాలనీలో నివాసం ఉంటున్న తేళ్ళ మార్కు (48) కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తుంటాడు. కూలి పని నిమిత్తం ఇంటి నుండి ఊరికి వెళుతుండగా రైలు పట్టాలు దాటే క్రమంలో ప్రమాద వశాత్తు విజయవాడ నుండి ఒంగోలు వైపుకు వెళుతున్న రైలు ఢీకొందని బంధువులు తెలిపారు. ప్రమాదంలో మార్కు అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఘటనా స్థలంకు చేరుకున్నారు. మృతదేహాన్ని చూసి బోరున విలపించారు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసుల వివరాలు సేకరించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. మృత దేహానికి పోస్టు మార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అందచేశారు. మృతునికి భార్య విజయలక్ష్మి, నవ్యశ్రీ, మహేష్ అనే ఇద్దరు పిల్లలు ఉన్నారు.

వీరబ్రహ్మాం గారి జయంతి

ప్రజాశక్తి - ఇంకొల్లు

స్థానిక నాగులు చెరువు కట్ట వద్ద ఉన్న శ్రీ గోవిందామ, పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో పోతులూరి వీరబ్రహ్మాంగారి 416వ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ నిర్వహకులు, అర్చకులైన మచ్చ వెంకటేశ్వర్లు, హేమలత ఉత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రీయ సంగీత విద్వాంసులు మద్దినేని ప్రతాప్ కుమార్ ఆధ్వర్యంలో భజన సమాజం వారిచే భక్తి గీతాలు పాడి ఆలరింప చేశారు.

ప్రజాశక్తి
7
గురువారం 14 నవంబర్ 2024

బాధితులకు సహాయ కిట్లు అందజేస్తున్న ఉన్నం కిరణ్

వరద బాధితులకు కిట్లు అందజేత

ప్రజాశక్తి - భట్టిప్రోలు

ఇటీవల కృష్ణా నది వరద ముంపుకు గురైన భట్టిప్రోలు, కొల్లూరు, కొల్లిపర్ర మండలాల్లోని లంక గ్రామాల్లో వరద బాధితులకు హనీవెల్ ఫౌండేషన్, అమెరికేర్స్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గుంటూరు దయాసిన్ సోషల్ సర్వీస్ వెల్ఫేర్ సొసైటీ సహకారంతో అన్నవరపు లంక గ్రామంలో 500 మందికి కిట్లను ముంబైకి చెందిన రిషికేశ్, గుంటూరు దయాసిన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఫాదర్ వున్నం కిరణ్, అమెరి కేర్స్ ఇండియా ఫౌండేషన్ అధినేతలు అరీష్, నితీష్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఫాదర్ వున్నం కిరణ్, అరిష్, నితీష్, రిషికేష్ మాట్లాడుతూ పేదవారికి సేవ చేయడం దేవుడు ఇచ్చిన వరమని అన్నారు. కొల్లిపర, అన్నవరపు లంక గ్రామంలోనే కాకుండా కొల్లూరు మండలం చినుమూరులంక, తడికలపూడి, కొత్తగూడెం, భట్టిప్రోలు మండలం పెదలంక, మద్దిగూడెం లంక గ్రామాల్లో తమ ఫౌండేషన్స్ ఆధ్వర్యంలో 2,334 కిట్లు పంపిణీ చేశామని అన్నారు. రూ.6వేల విలువైన సరుకులు కిట్లలో ఉన్నాయన్నారు. రూ.కోటికి పైనే విలువైన సరుకులు పంపిణీ చేసినట్లు తెలిపారు.

మాట్లాడుతున్న డిఇఒ ఎస్ పురుషోత్తం

స్కౌట్ తృతీయ సోపాన్ టెస్టింగ్

ప్రజాశక్తి - కర్లపాలెం

నాయకత్వం, సేవా గుణం, పోటీతత్వం నేర్పించేది స్కౌట్ అని డిఇఒ ఎస్ పురుషోత్తం అన్నారు. యాజలి జెడ్‌పి ఉన్నత పాఠశాలలో ఈ నెల 9నుంచి జరుగుతున్న స్కౌట్ తృతీయ సోపాన్ టెస్టింగ్ క్యాంపు ముగింపు సందర్భంగా ఆయన మాట్లాడారు. డిస్ట్రిక్ట్ సెక్రటరీ టి వెంకటరాజు, శ్రీనివాసరావు, హెచ్ఎం శ్రీ నివాసరావు, ఎండి సాదిక్, స్కౌట్ అధికారులు డిఎల్ నారాయణ, బి రవీంద్రబాబు, కాకుమాను లాజర్, అబ్దుల్‌నాజీర్, ఎం వరకమలాదేవి, ప్రభావతి పాల్గొన్నారు.

కంటి వైద్య పరీక్ష నిర్వహిస్తున్న వైద్యులు

ఉచిత మెగా కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి - భట్టిప్రోలు

పేద వర్గాలను ఆదుకునేందుకే వైపి రావు చారిటబుల్ ట్రస్ట్ స్థాపించినట్లు వైపి రావు చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు ఎన్ఎం సురేష్ పేర్కొన్నారు. పెసర్లంక పంచాయతీ ఆవరణలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ పీపుల్ నేషనల్ చైర్ పర్సన్ డాక్టర్ జ్ఞాన సుందరి శిబిరాన్ని ప్రారంభించారు. సురేష్ తండ్రి యన్నం పార్వతీశ్వరరావు ట్రస్ట్ ద్వారా భవిష్యత్తులో అనేక సేవా కార్యక్రమాలు జరిపించాలని కోరారు. అవసరమైన వారికి ఉచితంగా కళ్ళజోళ్ళు, శుక్లాల ఆపరేషన్ చేయించ నున్నట్లు తెలిపారు. 216మంది వైద్య పరీక్షలు చేయించు కున్నట్లు తెలిపారు. సర్పంచ్ వేములపల్లి వెంకటేశ్వర రావు, విశ్వనాథపల్లి వెంకటేశ్వ రరావు, ఎరగళ్ల సాంబశివ రావు, పిజి అరుణ్‌శాస్త్రి, గోలి శ్రీనివాసరావు, జంపాని రవి, దోవ పోలిమట్ల నాగేశ్వరరావు, సాంబశివరావు, కాసుల పద్మ, బత్తుల గీత, కారుమూరు హనోక్ పాల్గొన్నారు.

భవిష్యత్ తరాల కోసం మొక్కలు నాటాలి

ప్రజాశక్తి - రేపల్లె

భవిష్యత్ తరాలకు మనం మంచి చేయాలంటే ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని డిఎస్పి ఆవుల శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని రైల్వే స్టేషన్ దగ్గర్లోని ఇండియన్ బ్యాంకు బజార్ మొదట్లో ఉన్న చెత్త పాయింట్ శుభ్రం చేసి అక్కడ మొక్కలు నాటారు. ప్రతి రోజు వేల మంది తిరిగే ఇండియన్ బ్యాంకు బజార్లో వేసే చెత్తను ఎప్పటికప్పుడు మునిసిపల్ కార్మికులు శుభ్రం చేస్తున్నప్పటికి మరల ఆ ప్రాంతం చెత్తతో నిండి ఉండటంతో ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నందున మునిసిపల్ అధికారులు ఆ ప్రాంతాన్ని శుభ్రం చేసి మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మొక్క నాటిన అనంతరం మాట్లాడుతూ మొక్కలు నాటే కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. ప్రజల భాగస్వామ్యం ఉంటేనే ఏ కార్యక్రమమైనా విజయవంతం అవుతుందన్నారు. పట్టణంలో ఖాళీ స్థలాల్లో విరివిగా మొక్కలు నాటాలని సూచించారు. మానవుని మునుగడకు పచ్చదనం ఎంతో ముఖ్యమన్నారు. మన పూర్వీకులు వందేళ్ల ఆరోగ్యంగా బ్రతికారంటే దానికి చెట్లే కారణమన్నారు. మొక్క నుండి చెట్టు వరకు ప్రతి మనిషికి ఎంతో అవసరమని అన్నారు. పచ్చదనంలోకి వెళితే ఒత్తిడికి దూరమై ప్రశాంతత చేకూరుతుందన్నారు. మొక్క నుండి చెట్టుకు ఎదగాలంటే ఎంతో శ్రమ పడాల్సిన అవసరం ఉందన్నారు. అదే చెట్టును నరకాలంటే ఒక క్షణం చాలన్నారు. పచ్చని చెట్లను పెంచితే తప్ప మనిషికి మనుగడ లేదన్నారు. ఒక్కో వ్యక్తి ఒక మొక్క నాటి సంరక్షించాలని కోరారు. మనం ఆరోగ్యంగా ఉండాలని, సమాజం ఆరోగ్యంగా ఉండాలంటే మొక్కలు పెంచాలని కోరారు. పరిశుభ్రతకు పట్టణ ప్రజలు సహకరించాలని కమీషనర్ కె సాంబశివరావు ప్రజలను కోరారు. కార్యక్రమంలో డిఎస్పితో పాటు మునిసిపల్ చైర్ పర్సన్ కట్టా మంగ, వైస్ చైర్ పర్సన్ జి ప్రశాంత్ కుమార్, టి కాశీవిశ్వనాథ గుప్త, శానిటరీ ఇన్స్‌పెక్టర్ ఆకురాతి రామచంద్రరావు, లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షుడు కోడె గౌరీ శంకర్ పాల్గొన్నారు.

మొక్కలు నాటుతున్న డిఎస్‌పి శ్రీనివాసరావు

'సురేష్' పొలం పరిశీలన

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండలంలోని పెసర్లంక ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన యన్నం సురేష్ పొలానికి మధ్యగా జూన్ నెలలో వేసిన రోడ్డును బుధవారం హ్యూమన్ రైట్స్ ప్రొడక్షన్ కౌన్సిల్ ఆఫ్ పీపుల్ నేషనల్ కమిటీ చైర్ పర్సన్ డాక్టర్ జ్ఞాన సుందరి బుధవారం పరిశీలించారు. సురేష్‌కు చెందిన పొలంలో రైతులు మధ్యలో రోడ్డు వేయటంతో సురేష్ రెవెన్యూ, పోలీసు అధికారులకు విన్నవించుకున్నప్పటికీ పట్టించుకోకపోవడంతో ఎస్సీ కమిషన్‌ను ఆశ్రయించగా ఎస్సీ కమిషన్ చైర్మన్ స్వయంగా బాధితుని కుటుంబాన్ని పరామర్శించారు. పొలంలో వేసిన రోడ్డును పరిశీలించి సురేష్‌కు అన్యాయం జరిగిందని గ్రహించి తక్షణమే రోడ్డు తొలగించాలని అధికారులను ఆదేశించారు. దీంతో రెవెన్యూ అధికారులు రోడ్డును అప్పట్లో తొలగించారని, మరలా ఆగస్టు 25న అక్రమంగా ఒక సమూహంగా వచ్చి సురేష్ కుటుంబ సభ్యుల్ని బెదిరించి దుర్భాషలాడి తన పొలం మధ్యలో రోడ్డు వేశారని వివరించాడు. దళిత కుటుంబానికి చెందిన యన్నం సురేష్‌ను కొంతమంది అగ్రవర్ణ పెత్తందారులు రాజకీయ నాయకుల అండదండలతో ఒక గ్రూపు సమూహంతో వచ్చి భయభ్రాంతులకు గురిచేసి పొలాన్ని ఆక్రమించి పొలం మధ్యలో రోడ్డు వేయటం దారుణమైన విషయమని అన్నారు. అధికారులతో మాట్లాడి రోడ్డు తొలగించేందుకు ప్రయత్నం చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో విశ్వనాథపల్లి వెంకటేశ్వరరావు, హ్యూమన్ రైట్స్ రాష్ట్ర సెక్రటరీ కాసుల పద్మ, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు భక్తుల గీత, రాష్ట్ర మీడియా ఇంచార్జ్ కారుమూరు హనోక్, ప్రముఖ న్యాయవాది యరగళ్ళ సాంబశివరావు, అంబేద్కర్ యూత్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు పిజి అరుణ్ శాస్త్రి, గోలి శ్రీనివాసరావు, పోలిమెట్ల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

యన్నం సురేష్ పొలాన్ని పరిశీలిస్తున్న జ్ఞాన సుందరి

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

గోడ ప్రతులను ఆవిష్కరిస్తున్న గ్రంథాలయ కమిటీ సభ్యులు

ప్రజాశక్తి - బాపట్ల

గ్రంథాలయ వారోత్సవాలను ఈనెల 14నుండి 20 వరకు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారి అంగలకుదురు శివాజీ గణేషన్ బుధవారం తెలిపారు. వారోత్సవాల గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి పిసి సాయిబాబు పాల్గొన్నారు.

భట్టిప్రోలు : స్థానిక మాటూరు శాఖా గ్రంథాలయంలో 14నుండి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు జరుగుతాయని లైబ్రేరియన్ సుభాష్ చంద్రబోస్ తెలిపారు.

కర్లపాలెం : గ్రంథాలయాలు మానవ వికాసానికి దోహద పడతాయని ఇనకొల్లు పోలీసురావు అన్నారు. జాతీయ గ్రంథాలయాల వారోత్సవాల కరపత్రాన్ని ఆయన బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో లైబ్రరీన్ టివి రమణ, ఎం ఇందుమతి, లీలా ప్రసన్న పాల్గొన్నారు.

నిజాంపట్నం : స్థానిక గ్రంథాలయంలో 14 నుండి 20వరకు గ్రంథాలయం వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ నిర్వాహకులు ఎన్ విజయలక్ష్మి బుధవారం విలేకరుల సమావేశంలో తెలిపారు.

14న ఓటర్ల అభ్యంతరాలు తెలుపుకోవచ్చు

ప్రజాశక్తి - పంగులూరు

మండలంలోని నాగార్జునసాగర్ జవహర్ కెనాల్ ఆయకట్టులోని మేజర్ నీటి వినియోగదారుల సంఘాల ఓటర్ల జాబితాలో ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 14న గురువారం తమ కార్యాలయంలో తెలియజేయాలని తహశీల్దారు పి సింగారావు కోరారు. కొండ మంజులూరు 1, 2, చందలూరు-1, 2, పంగులూరు-1, 2, రామకూరు, దుద్దుకూరు, ఇంకొల్లు-1, కోలలపూడి, అద్దంకి-2, 3, రావినూతల ఫారం డి ఓటర్ల జాబితా (రూల్ 9(2) ఎపి ఫార్మర్ మేనేజ్మెంట్ ఆఫ్ ఇరిగేషన్ సిస్టం రూల్స్ 2003 సంబంధిత సచివాలయాల్లో ఈనెల 11న నీటి వినియోగదారుల పరిశీలనార్థం ఓటర్ల జాబితా ప్రచురించామని తెలిపారు. రైతులు ఓటర్ల జాబితా పరిశీలించుకుని ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని అన్నారు. ఈనెల 20న ఎన్నికల అధికారి ద్వారా నోటిఫికేషన్ జారీ చేస్తారని చెప్పారు. ఈనెల 23న టిసిలకు ఎన్నికలు జరుగుతాయని, అదే రోజు డబ్ల్యుయుఎలకు అధ్యక్షుడు, ఉపాధ్యక్షులను ఎన్నుకుంటారని చెప్పారు.

పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ నీలా ఉషారాణి రమేష్

సిసి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండలంలోని పెదపులివర్రు పంచాయతీలోని గాజులపేటలో ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరైన నిధులతో సిసి రోడ్డు నిర్మాణ పనులు బుధవారం ప్రారంభించారు. ఈపాటికే కే వాల్ నిర్మించి డస్టు నింపగా దానిపై సిసి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. గ్రామంలో ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న ప్రజలకు ఉపాధి హామీ నిధులతో రహదారి పూర్తిచేయడం గర్వంగా ఉందని ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌తో పాటు పాలక వర్గ సభ్యులు వాకా కనకమహాలక్ష్మి పాల్గొన్నారు.

కరపత్రాన్ని విడుదల చేస్తున్న సిడిపిఓ

బాలల హక్కులు కాపాడాలి

ప్రజాశక్తి - మేదరమెట్ల

స్థానిక ఐసిడిఎస్ కార్యాలయంలో బుధవారం బాల్య వివాహాలను అంతం చేద్దామనే కార్యక్రమాన్ని ఈనెల 14 నుండి 20 వరకు జరుగుతున్నందున సిడిపిఒ ఎ కృష్ణకుమారి కరపత్రాన్ని విడుదల చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సమాజంలో బాలల హక్కులను కాపాడవలసిన బాధ్యత మనందరిపై ఉన్నదని అన్నారు. సమాజంలో బాలికలపై జరుగుతున్న అత్యాచారాలను ఖండించాలని అన్నారు. నివారణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని అన్నారు. దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో కరపత్రాన్ని విడుదల చేశారు. కార్యక్రమంలో డిబిఆర్సి రీజనల్ కోటేశ్వరరావు, కో ఆర్డినేటర్ డి కోటేశ్వరరావు, ఐసిడిఎస్ సూపర్వైజర్ కె ఇందిరా పాల్గొన్నారు.

పిల్లలకు వ్యాధి నివారణ టీకాలు

ప్రజాశక్తి - ఇంకొల్లు

స్థానిక పిహెచ్సి పరిధిలో చంటి బిడ్డలకు వ్యాధి నివారణ టీకాలు బుధవారం వేశారు. ప్రతి నెల టీకాలు వేసే కార్యక్రమం తప్పనిసరిగా నిర్వహిస్తున్నట్లు పిహెచ్‌సి డాక్టర్ భాను ప్రకాష్, ఆంజలి తెలిపారు. స్థానిక ఎన్టీఆర్ బొమ్మ వద్ద ఉన్న ఆరోగ్య ఉపకేంద్రం, డివిప్ప కాలనీ పరిధిలో గ్రామంలో ఉన్న పిల్లలకు టీకాలు వేశారు. కార్యక్రమంలో ఎఎన్ఎంలు సుభాషిని, ప్రశాంతి, సౌమ్య, ఆశాలు సుభాషిని, అన్నపూర్ణమ్మ, రామాంజమ్మ పాల్గొన్నారు.

నేటి నుండి సహకార వారోత్సవాలు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

అధికారి శ్యామ్ సన్

జిల్లా వ్యాప్తంగా ఈనెల 14నుండి 21వరకు సహకార వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా సహకార అధికారి శ్యామ్‌సన్ కోరారు. స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో బుధవారం ఆయన సాధారణ తనిఖీలు నిర్వహించి రికార్డులు పరిశీలించారు. ఈ ఏడాది జిల్లాలో 40 సహకార సంఘాల ద్వారా పంట ఉత్పత్తులు కొనుగోలు చేసేందుకు కేంద్రాలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో పిఎసిఎస్ సిఇఒ వేములపల్లి శ్రీనివాసరావు ఉన్నారు.

ల్యాండ్ బ్యాంకు కోసం భూమిని గుర్తించాలి..

కలెక్టర్ వెంకటమురళి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ల్యాండ్ బ్యాంక్ కోసం భూమిని గుర్తించి తహశీల్దార్లు స్పష్టమైన నివేదిక ఇవ్వాలని కలెక్టర్ జె.వెంకటమురళి ఆదేశించారు. ల్యాండ్ బ్యాంక్, స్మశాన భూముల సమస్య, ఎస్టీలకు ఆధార్ నమోదు ప్రక్రియపై రెవెన్యూ అధికారులతో బుధవారం స్థానిక కలెక్టరేట్ నుంచి ఆయన వీక్షణ సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ ఖాళీ భూములను సంరక్షించాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులపై ఉందని కలెక్టర్ చెప్పారు. ప్రభుత్వ భూములను అభివృద్ధికి వినియోగించేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఇందుకోసం ఖాళీ భూములను సిద్ధం చేయాలన్నారు. ముఖ్యంగా పెట్రోల్ బంకులు వంటివి రెవెన్యూ ఆధీనంలోనే ఉండేలా ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. తద్వారా ఆదాయ వనరులు పెంచడమే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. ప్రస్తుతం బాపట్ల రెవెన్యూ డివిజన్ పరిధిలో మొత్తం 203.63 ఎకరాల ప్రభుత్వ భూమి ఖాళీగా ఉన్నట్లు ఆర్డీవో పి గ్లోరియా కలెక్టర్ దృష్టికి తెచ్చారు. రేపల్లె రెవెన్యూ డివిజన్ పరిధిలో 98 ఎకరాలు ఉండగా, చీరాల రెవిన్యూ డివిజన్ పరిధిలో 90.38 ఎకరాల భూమి ఉందని ప్రాథమికంగా నివేదిక అందించారు. పది రోజుల్లో పూర్తి వివరాలను ఇవ్వాలని రెవెన్యూ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అధికారులు నిర్లిప్తంగా వ్యవహరిస్తే వారిపై చర్యలు ఉంటాయన్నారు. ఖాళీ భూములు లేవని చెప్పిన ప్రాంతాలలో క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలిస్తామన్నారు. ఆ సమయంలో ఖాళీ భూములు కనిపిస్తే సంబంధిత మండలాల్లోని రెవెన్యూ అధికారుల నిర్లిప్తపై కఠినచర్యలు ఉంటాయన్నారు. సర్వే జాగ్రత్తగా చేయాలన్నారు.

ఆధార్ కార్డులు లేని ఎస్టీలను గుర్తించి యుద్ధ ప్రాతిపదికన కార్డులు ఇప్పించాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. జిల్లాలో 2,506 మంది ఎస్టీలు ఆధార్ కార్డులు లేనట్లు గుర్తించామన్నారు. ప్రత్యేక డ్రైవ్ ద్వారా అందులో 1,311 మందికి ఆధార్ కార్డుల కొరకు నమోదు ప్రక్రియ చేపట్టామన్నారు. చీరాలలో 418 మందికి, బాపట్లలో 323 మందికి, రేపల్లెలో 570 మందికి నమోదు పూర్తయిందన్నారు. 255 మందికి జనన ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని సూచించారు. అమలులో ఉన్న పథకాలను వారికి చేరేలా ప్రతి మండల తహసీల్దార్ చర్యలు తీసుకోవాలన్నారు.

శాసనమండలి ఎన్నికల నేపథ్యంలో ఓటర్ల నమోదు ప్రక్రియ ఈనెల 20వ తేదీలోగా ముగుస్తుందని కలెక్టర్ వెంకట మురళి తెలిపారు. అప్పటిలోగా వచ్చిన దరఖాస్తుల విచారణ సత్వరమే పూర్తి చేయాలన్నారు. జిల్లాలోని ఇసుక, బుసక, గ్రావెల్ ని ఎస్కవేషన్ యంత్రాలతో తవ్వకాలకి ఎలాంటి అనుమతులు ఇవ్వలేదన్నారు. ఇసుక తవ్వకాలకు ఎద్దుల బండి, ట్రాక్టర్లకు మాత్రమే అనుమతులు ఇచ్చామన్నారు. ఉచిత ఇసుక విధానంపై ఆరోపణలు వచ్చినా, నిబంధనలను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్, జిల్లా రెవెన్యూ అధికారి జి గంగాధర్ గౌడ్, బాపట్ల, చీరాల, రేపల్లె ఆర్డీవోలు పి గ్లోరియా, చంద్రశేఖర్, రామలక్ష్మి, మండలాల నుంచి తహశీల్దార్లు, సర్వేయర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఒంగోలు నగర అభివృద్ధికి సమగ్ర చర్యలు చేపట్టాలి

- నగర మహాసభ సందర్భంగా నేడు బహిరంగ సభ
- 17న సుందరయ్య భవన్లో పార్టీ ప్రతినిధుల సభ
- సిపిఎం నగర కార్యదర్శి జి.రమేష్

సిపిఎం నగర కార్యదర్శి జి.రమేష్

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

సిపిఎం ఒంగోలు నగర 13వ మహాసభల సందర్భంగా గురువారం నగరంలోని అద్దంకి బస్టాండ్ సెంటర్లో సాయంత్రం నాలుగు గంటలకు ప్రజా పోరు పేరుతో బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ నగర కార్యదర్శి జి.రమేష్ బుధవారం తెలిపారు. 14న ప్రజాపోరు సభ, 17న ఉదయం 10 గంటలకు సుందరయ్య భవన్లో పార్టీ నగర ప్రతినిధుల సభ ఉంటుందని పేర్కొన్నారు. పార్టీ బహిరంగ సభ, ప్రతినిధుల సభ సందర్భంగా బుధవారం ఆయన 'ప్రజాశక్తి'తో మాట్లాడారు. ఒంగోలు నగర సమగ్ర అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రధానంగా ఒంగోలు నగరంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని తెలిపారు. ఒంగోలు నగరంలో రోజూ తాగునీటిని అందిస్తామని ప్రస్తుతం అధికారంలో ఉన్న ప్రభుత్వంతో పాటు గతంలో పనిచేసిన ప్రభుత్వాలు కూడా ఎన్నికల సమయంలో వాగ్దానాలు చేయడం జరిగిందని గుర్తు చేశారు. ఆ హామీలను ప్రభుత్వాలు నెరవేర్చాలని కోరారు. శివారు కాలనీలకు పైపులైన్లు ఏర్పాటు చేయాలని, ఓవర్ హెడ్ ట్యాంకులు నిర్మించాలని కోరారు. ఇందుకోసం రూ.400 కోట్లు ప్రభుత్వం నుంచి నిధులు తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. నగరంలో సుమారు 24 వేల మంది పేదలు ఇళ్ల స్థలాలు లేకుండా ఉన్నారని గతంలో పాలకులు ప్రకటించడం జరిగిందని తెలిపారు. వారిలో సుమారు 20 వేల మందికి ప్రభుత్వం ద్వారా పట్టాలు కూడా ఇచ్చారని గుర్తు చేశారు. అయితే వారిలో ఎవరికీ పొజిషన్ చూపించలేదని తెలిపారు. వారికి వెంటనే పొజిషన్ చూపించాలని కోరారు. అదేవిధంగా ప్రభుత్వ భూముల్లో నివాసం ఉంటున్న పేదలకు పట్టాలు ఇవ్వాలని కోరారు. పెండింగ్లో ఉన్న 4,500 టిడ్కో ఇళ్లను పూర్తి చేసి లబ్దిదారులకు అందించాలని కోరారు. జిప్లస్ త్రీ విధానంలో ఇంటి కోసం డబ్బులు కట్టిన వారికి, వారి వాటా సొమ్మును తిరిగి చెల్లించాలని కోరారు. నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మించాలని, పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని, దోమలు నివారించాలని, ప్రతిరోజూ మురుగు కాలువలు శుభ్రం చేయాలని, ఫాగింగ్ నిర్వహించాలని కోరారు. పోతురాజు కాలువ ఆధునీకరణ పనులు మొదలుపెట్టాలని, దాని కోసం నిధులు తీసుకురావాలని కోరారు. త్వరగా పనులు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. రిమ్స్ వైద్యశాలను సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్గా మార్చాలని కోరారు. ఊర చెరువు ఖాళీ స్థలంలో చిన్న పిల్లల పార్కు, వాకింగ్ ట్రాక్ అభివృద్ధి చేయాలని కోరారు. నగరంలో అన్ని శ్మశాన వాటికలను అభివృద్ధి చేయాలని, ఆర్టీసీ డిపో దగ్గర ఉన్న శ్మశానంలో గ్యాస్ క్రిమటోరియమ్ని వినియోగంలోకి తేవాలని కోరారు. యూనివర్సిటీని త్వరగా పూర్తి చేసి ప్రారంభించాలని, దానికి కావాల్సిన నిధులు కేటాయించాలని కోరారు. నగరంలో కుక్కలబెడదను నివారించాలని విజ్ఞప్తి చేశారు. నగరంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని, పర్మినెంట్ ఆటో స్టాండ్లు ఏర్పాటు చేయాలని, వీధి వ్యాపారుల ఉపాధిని కాపాడాలని కోరారు. నగరంలో ఈపాటికే ఇల్లు నిర్మించుకొని నివాసంఉంటున్న ప్రజలకు ఇంటి పన్నులు వేయాలని కోరారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చిన తర్వాత అధిక ధరలు, నిరుద్యోగం, మహిళలు, ఆడపిల్లలు, దళితులపై అత్యాచారాలు లాంటి సమస్యలు పెరిగాయని, పోలవరం నిర్వాసితుల సమస్య, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ లాంటి సమస్యలు అనేకం ముందుకు వచ్చాయని తెలిపారు. ఈ సమస్యలు పరిష్కరించాలని నవంబర్ 8 నుంచి 14 వరకు సిపిఎం రాష్ట్రవ్యాప్తంగా ఇంటింటా ప్రచారం, ప్రదర్శనలు, బహిరంగ సభలు నిర్వహిస్తుందని తెలిపారు. అందులో భాగంగానే సిపిఎం ఒంగోలు నగర 13వ మహాసభ సందర్భంగా ఈ నెల 14వ తేదీన ప్రజా పోరు పేరుతో సభ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ మహాసభకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. సభలో పార్టీ శ్రేణులు, అభిమానులు ,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అంగన్వాడీ కేంద్రాలలో మౌలిక వసతులు కల్పించాలి..

కలెక్టర్ జె. వెంకటమురళి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ప్రతి అంగన్వాడీ కేంద్రానికి తాగునీరు, మరుగుదొడ్లు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని కలెక్టర్ జె వెంకటమురళి తెలిపారు. అంగన్వాడీ కేంద్రాలలో మౌలిక వసతుల ఏర్పాట్లపై అనుబంధ శాఖల అధికారులతో కలెక్టర్ ఛాంబర్లో బుధవారం ఆయన సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రాలలో చిన్నారులకు అసౌకర్యం లేకుండా చూడాలన్నారు. తాగునీటి సౌకర్యం లేని అంగన్వాడీ కేంద్రాలు జిల్లాలో 458 ఉన్నాయని పేర్కొన్నారు. తాగునీటి కొళాయిలు ఏర్పాటు కొరకు ఒక్కొక్క కేంద్రానికి రూ.17 వేలు చొప్పున నిధులు కేటాయించిందన్నారు. 458 కేంద్రాలకు రూ.77.86 లక్షలు నిధులు విడుదలయ్యాయని వివరించారు. సమావేశంలో మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీ ఉమా, ఆర్డబ్ల్యుఎస్ ఎస్ఈ అనంతరాజు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటమురళి

అఖిలభారత సహకార వారోత్సవాల వాల్పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

వాల్పోస్టర్ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ జె వెంకట మురళి

అఖిల భారత సహకార వారోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ జె. వెంకట మురళి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ లో 71వ అఖిలభారత సహకార వారోత్సవాల వాల్ పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సహకార వారోత్సవాలు నవంబర్ 14 నుండి 20 వ తేదీ వరకు నిర్వహించుకుంటున్నా మన్నారు. వికసిత్ భారత్ నిర్మాణంలో సహకార సంఘాల పాత్ర ఎంతో ముఖ్యమన్నారు. నవంబర్ 14న సహకార మంత్రిత్వ శాఖ యొక్క కొత్త కార్యక్రమాల ద్వారా ఉద్యమాన్ని బలోపేతం చేయు కార్యక్రమాలు, 15న సహకార సంఘాలలో నూతన ఆవిష్కరణలు, సాంకేతికత సుపరిపాలన కార్యక్రమాలు, 16న వ్యవస్థాపకత, ఉపాధి కల్పన నైపుణ్య అభివృద్ధిని పెంపొందించడంలో సహకార సంఘాల పాత్ర కార్యక్రమాలు, 17న సహకార సంస్థలు వ్యాపార ప్రయోజిత సంస్థలుగా రూపాంతరం కార్యక్రమాలు, 18న సహకార సంఘాల మధ్య సహకారాన్ని పెంపొందించు కార్యక్రమాలు, 19న మహిళలు, యువత బలహీన వర్గాల కోసం సహకార సంఘాలు కార్యక్రమాలు, 20న సుస్థిర అభివృద్ధి లక్ష్యసాధనలో మెరుగైన ప్రపంచ నిర్మాణంలో సహకార సంఘాల పాత్ర తదితర కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి సిహెచ్ సంసోను, కాటసాని తిరుపాల్రెడ్డి, జిల్లా సహకార ఆడిట్ అధికారి మరకా రవికుమార్, అసిస్టెంట్ రిజిస్ట్రార్, జిల్లా సహకార అధికారి గోగుల శ్రీనివాసులు పాల్గొన్నారు.

నేటి నుంచి 'బంగారు బాలోత్సవాలు'

- అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి - అధికారులకు కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిల్లావ్యాప్తంగా ఈ నెల 14 నుంచి వారం రోజులపాటు "బంగారు బాల్యం" కార్యక్రమంలో "బంగారు బాలోత్సవాలు" నిర్వహించబోతున్నట్లు కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా తెలిపారు. ఈ వారోత్సవాల నిర్వహణ, భాగస్వామ్యం, ఏర్పాట్లపై బుధవారం ప్రకాశం భవనం నుంచి మండలస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ వారం రోజులపాటు బంగారు బాల్యానికి శ్రీకారం-బాలోత్సవాలతో ప్రారంభం, మన హక్కులు తెలుసుకుందాం, మనకోసం మనం, మా పిల్లలు - మా బాధ్యత, సదా బాలల సేవలో, మా కలలు-మా స్వప్నాలు, చేయి చేయి కలుపుదాం-బంగారు బాల్యాన్ని అందిద్దాం అనే ఇతివృత్తాలతో ప్రత్యేక కార్యక్రమాలను జిల్లా వ్యాప్తంగా ప్రతి రోజూ నిర్వహించాలన్నారు. ఈ దిశగా విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించడంతోపాటు ప్రజాప్రతినిధులను, స్వచ్ఛంద సంస్థలను భాగస్వాములను చేస్తూ ర్యాలీలు, కమ్యూనిటీ మీటింగ్స్, అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామ, మండల, డివిజన్ స్థాయి పోటీలలో విజేతలకు జిల్లా స్థాయిలోనూ పోటీలు నిర్వహించి ఈ నెల 20వ తేదీన ఒంగోలులోని మినీ స్టేడియంలో ముగింపు ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. విజేతలైన విద్యార్థులతోపాటు ఆయా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొన్న అధికారులకు బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. కేవలం వారోత్సవాలతోనే సరిపెట్టకుండా జిల్లాలోని 0-18 ఏళ్ల బాలల హక్కుల పరిరక్షణ, వారి సర్వతోముఖాభివృద్ధికి నిరంతరం కృషి చేసేలా సంబంధిత శాఖల అధికారులతో గ్రామ, మండల, డివిజన్, జిల్లా స్థాయిలో ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. ప్రతి నెలా మొదటి శుక్రవారం గ్రామ స్థాయి కమిటీ సమావేశం ఉంటుందని కలెక్టర్ తెలిపారు. రెండో శుక్రవారం మండల, మూడో శుక్రవారం డివిజన్, నాలుగో శుక్రవారం జిల్లా స్థాయి కమిటీ సమావేశం ఉంటుందన్నారు. స్కూల్ నుంచి డ్రాపౌట్, బాల కార్మిక, బాల్య వివాహం, అనారోగ్యాల బారిన పడే బాలలను గుర్తించి ప్రతి ఒక్కరి పరిస్థితికి తగినట్లుగా ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తామని స్పష్టం చేశారు. పేదరికం లేని ఆంధ్రప్రదేశ్ అవతరించాలనే రాష్ట్ర ప్రభుత్వ ఆలోచనకు అనుగుణంగా విద్యావంతమైన, ఆరోగ్యకరమైన, బాల్య వివాహ రహితమైన, బాల కార్మిక రహితమైన ప్రకాశం జిల్లా కూడా ఆవిష్కృతమయ్యేలా ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్లో డిఆర్ఒ బి. చినఓబులేసు, ఐసిడిఎస్ పిడి కె.మాధురి, డిఈఓ కిరణ్ కుమార్ మెప్మా పీడీ టి.రవికుమార్, డిఆర్డిఏ పీడీ టి. వసుంధర, డిఎం,హెచ్ఓ డాక్టర్ ఎస్.సురేష్ కుమార్, డిసిహెచ్ఎస్ సూరిబాబు, కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ గాయత్రి దేవీ, జడ్పీ సిఇఓ చిరంజీవి, బిసి సంక్షేమ అధికారి అంజల, రిమ్స్ సూపరింటెండెంట్ డాక్టర్ టి.జమున, ఇతర అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.